ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
మంగళవారం 15 ఏప్రిల్ 2025 | 5







రాజమహేంద్రవరంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు

అంబేడ్కర్‌కు ఘన నివాళి

- జిల్లా అంతటా జయంతి వేడుకలు
- ఊరూరా సంబరాలు.. విందులు
- హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

వేమగిరిలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్





రాజమహేంద్రవరంలో జేసీ, ఎస్పీ నివాళులు

మామిడి.. నేలబడి..



ఈదురుగాలుల బీభత్సానికి ధర్మవరంలో నేలరాలిన మామిడి



- రారాజు మామిడికి గడ్డురోజు
- ఉమ్మడి తూ.గో.జిల్లాలో అకాల వర్షాలతో తీవ్ర నష్టం
- తీవ్ర ఈదురుగాలులతో భారీగా రాలిపోయిన మామిడికాయలు
- ఈదురుగాలులకు 16 వేల ఎకరాల్లో నష్టం.. రైతులు లబోదిబో
- ఉమ్మడి జిల్లాలో 38,500 ఎకరాల్లో మామిడితోటలు.. ఒక్క కాకినాడ జిల్లాలోనే 18,400 ఎకరాల్లో సాగు
- ఉమ్మడి జిల్లా నుంచి ఏటా రెండు లక్షల మెట్రిక్ టన్నుల కాయల దిగుబడి

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

చూడగానే నోరూరించే మామిడి పండ్లు ఈ సీజన్‌లో కొనడం కష్టంగానే కనిపిస్తోంది.. అకాల వర్షాలు, వడగండ్లు... ఈదురుగాలులుతో కొన్నిరోజులుగా ఉమ్మడి జిల్లాలో మామిడికి తీవ్రంగా నష్టం వాటిల్లింది.. ఎక్కడికక్కడ చెట్ల నుంచి కాయలు భారీగా నేలరాలిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.. మరో రెండు వారాల్లో కాయలు పక్వానికి వచ్చే దశలో ఉండగా, అకాల వర్షాలు విరుచుకుపడడడంతో కాయలన్నీ ఎందుకు పనికిరాకుండా పోయిన పరిస్థితితో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈ ఏడాది మామిడి పూత ఆశాజనకంగా ఉండ డంతో మంచి లాభాలు వస్తాయని రైతులు అంచనా వేసుకున్నారు. అటు వ్యాపారులు సైతం లక్షల్లో అడ్వాన్సులు ఇవ్వడంతో రైతులు పెట్టుబడి భారీగా పెట్టారు. తీరా అకాలవర్షాలు తీవ్రంగా దెబ్బతీశాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 19 వేల ఎకరాల్లో తోటల్లో నేలరాలిన కాయలకు ఇప్పుడు ధరలు కూడా రాకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. వాస్తవానికి ఉమ్మడి జిల్లాలో 38,500 ఎకరాల్లో మామిడి తోటలు సాగవుతుండగా, ఒక్క కాకినాడ జిల్లాలోనే 18,400 ఎకరాల్లో ఉన్నాయి. ఏటా రెండు లక్షల మెట్రిక్ టన్నుల కాయల దిగుబడి జరుగుతుండగా, ఈ దఫా సగానికి పైగా దిగుబడి పడిపోయే ప్రమాదం ఉంది.

మామిడీలా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈనెల లోనే పలుసార్లు అనేక మండలాల్లో తీవ్రంగా ఈదురుగాలులు, వడగండ్ల వర్షాలు కురిశాయి. దీంతో చెట్లకు ఉన్న యాభై శాతానికిపైగా కాయలు రాలిపోయాయి. కాస్తోకూస్తో మిగిలిన కాయల నాణ్యత సైతం దెబ్బతినడంతో పెట్టుబడులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. పక్వానికి ముందే రాలిపోయిన మామిడి మార్కెట్లకు వచ్చినా కొనేందుకు ప్రజలు ఆసక్తి చూపించడం లేదు. అటు తాండ్ర తయారీదారులు అతి తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. వాస్తవానికి ఈ ఏడాది మామిడి పూత నూరుశాతం వచ్చింది. కాయలు సైతం 70శాతానికిపైగా నిలబడ్డాయి. ఫలితంగా భారీగా మార్కెట్ ఉంటుందని రైతులు భావించారు. ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు వచ్చి కాయలు చూసి లక్షల్లో రైతులకు అడ్వాన్సులు ఇచ్చారు. దీంతో లాభాలొస్తాయన్న అంచనాలతో రైతులు సైతం పెట్టుబడులు భారీగా పెట్టారు. ప్రధానంగా ఈసారి బంగినపల్లి టన్ను రూ.60 వేలు, కొత్తపల్లి కొబ్బరి టన్ను రూ.90 వేలు, పండూరు మామిడి టన్ను రూ.65 వేల వరకు ధర వెళ్తుందని రైతులు భావించారు. వాస్తవానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 38,500 ఎకరాల్లో మామిడి తోటలు సాగవుతున్నాయి. ఇందులో అత్యధికంగా కాకినాడ జిల్లాలోనే 18,400 ఎకరాల్లో సాగవుతోంది. ఏటా ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల మెట్రిక్ టన్నుల వరకు మామిడి దిగుబడి అవుతుంది. ఇందులో 600 టన్నుల వరకు ఒక్క దక్షిణ కొరియాకే ఎగుమతి అవుతాయి. ఇందులో ఎక్కువగా కాకినాడ జిల్లా నుంచి అధిక ఎగుమతులు జరుగుతాయి. అత్యధిక సాగు కాకినాడ జిల్లాలోని ప్రత్తిపాడు మండలం, గొల్లప్రోలు, తుని, తొండంగి, కోటనందూరు, శంఖవరం, రౌతులపూడి, జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో తోటలున్నాయి. అటు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రామచంద్రపురం, మండపేట, ఆలమూరు తదితర ప్రాంతాల్లో వివిధ రకాల మామిడి తోటలున్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్, సీతానగరం తదితర మండలాల్లో రైతులు వందల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. అయితే తాజాగా కురిసిన అకాల వర్షాలు, ఈదురుగాలులతో ఉమ్మడి జిల్లాలో 16 వేల ఎకరాల్లో తోటలకు నష్టం వాటిల్లినట్టు అంచనా. అయితే మరో రెండు వారాల్లో చెట్ల నుంచి కాయలు దించడానికి అంతా సిద్ధం చేసుకుంటున్న తరుణంలో అకాల వర్షాలతో రైతుల ఆశలన్నీ ఆవిరయ్యాయి. ప్రధానంగా ఈవారంలో మూడుసార్లు కురిసిన భారీ వర్షాలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ముఖ్యంగా ఆదివారం రాత్రి వీచిన భారీ ఈదురుగాలులు, వడగండ్ల వానతో నష్టం మరింత పెరిగింది. పది రోజుల వ్యవధిలో కాయలు కోసి మార్కెట్‌కు పంపడం తరువాయి అనే దశలో వీచిన పెనుగాలుల ప్రభావంతో మామిడితోటల్లో కాయలన్నీ నేలరాలిపోయాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎక్కడ మామిడి తోటలు చూసినా రాలిపోయిన మామిడికాయలు గుట్టలు, గుట్టలుగా కనిపిస్తున్నాయి. సాధారణంగా ఏప్రిల్ చివరి వారం నుంచి మార్కెట్‌కు నాణ్యత కలిగిన మామిడి రాక ప్రారంభమవుతుంది. అంతకంటే ముందుగానే మామిడి వచ్చినా వాటి నాణ్యత అంతంతమాత్రంగానే ఉంటుంది. ఈ ఏడాది మామిడి మార్కెట్ ఆశాజనకంగా ఉండడం, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి ఆర్డర్లు ఉన్న నేపథ్యంలో తమ పంట పండుతుందని రైతులు ఆశించారు. అయితే ఈదురుగాలులకు ఎక్కడిక్కడ మామిడికాయలు రాలిపోవడంతో వారు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. మామిడితోటల్లో రాలిన మామిడిని ఏరి గుట్టలుగా పోయడంలో రైతులు నిమగ్నమయ్యారు. రాలిన మామిడికి ఏరివేత కూలి వస్తే అదే చాలని చెబుతున్నారు. మరోవైపు చెట్లకు మిగిలి ఉన్న మామిడి నాణ్యత సైతం దెబ్బతినే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నారు.

కాయరాలితే నష్టం చెల్లింపు నిల్

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మామిడి, జీడిమామిడి వంటి పండ్లకు సంబంధించి ఈదురుగాలుల వల్ల కాయలు రాలిపోతాయి. చెట్ల కొమ్మలు విరిగిపోతుంటాయి. కానీ ప్రభుత్వ నిబంధన ప్రకారం ఏకంగా చెట్టు నేల కూలి తేనే పరిహారం ఇస్తారు. ఎన్నికాయలు రాలిపోయినా, చెట్టు కొమ్మలు విరిగిపోయినా పరిహారం రాదు. నిజానికి లక్షల్లో కౌలు చెల్లించి మామిడి తోటలు రైతులు తీసుకుంటారు. కాయలు రాలిపోతే మొత్తం నష్టపోతారు.

రుడాకు మాస్టర్ ప్లాన్!



- 1094 చ.కి.మీతో డ్రాఫ్ట్ రెడీ
- మొత్తం 3,156 చ.కి.మీతో 27 మండలాలు, 392 గ్రామాలకు వర్తించే ప్రయత్నం
- టూరిజం విజన్ డాక్యుమెంట్‌తో రుడా పరిధిలో టూరిజం అభివృద్ధి
- 1354 ఎకరాల్లో అనధికార లేఅవుట్లు
- పంచాయతీ సెక్రటరీలకు నోటీసులు
- నెలాఖరులోపు లేఅవుట్లు రద్దు చేసుకుని, తిరిగి దరఖాస్తు చేయాలి
- రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి



ఇంటర్వ్యూ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ(రుడా) పరిధిలోని అన్ని ప్రాంతాలను అనుసంధానం చేస్తూ మాస్టర్‌ప్లాన్ రూపొందించనున్నామని రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి వెల్లడించారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడారు. గతంలో రాజమహేంద్రవరం, పరిసర గ్రామాల పరిధిలో 162 చ.కిలోమీటర్ల మేర మాస్టర్‌ప్లాన్ అమలులో ఉంది. కానీ గోదావరి అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ ఉన్నప్పుడు 1094 చదరపు కిలోమీటర్ల మేర మాస్టర్ ప్లాన్ ముసాయిదాను తయారుచేశారు. కానీ అప్పట్లో దానిని ప్రభుత్వ ఆమోదం కోసం పంపలేదు. ఇవాళ దానిని మరింత మెరుగుపరచనున్నాం. దీనికోసం అభ్యంతరాలు తెలియజేయవలసిందిగా ప్రజలను కోరుతున్నామని రమణచౌదరి చెప్పారు. అంతేకాక ప్రస్తుతం రుడా పరిధి బాగా పెరిగింది. తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని ప్రాంతాలతోపాటు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రామచంద్రపురం, కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గాలు, ఏలూరు జిల్లాలోని ద్వారకాతిరుమల మండలం కూడా కలిసింది. దీంతో మొత్తం 3,156 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో మాస్టర్‌ప్లాన్ రూపొందించవలసి ఉందన్నారు. ప్రస్తుతం 1094 చదరపు కిలోమీటర్లతో మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్ సిద్ధంగా ఉంది. దానికి మిగిలిన 2 వేల 61 చదరపు కిలోమీటర్లు కలిపి మాస్టర్‌ప్లాన్ కోసం ప్రయత్నాలు మొదలు పెట్టాం. ఇదంతా పూర్తయితే మొత్తం ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని స్పష్టంచేశారు. రుడా పరిధిలో ఏరియా డెవప్‌మెంట్ ప్లాన్‌ను అమలు చేయనున్నాం. దాని కోసం కసరత్తు చేస్తున్నాం. ఏదో ప్లాన్ వేసి వదిలేయడం కాకుండా స్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కనిపించేలా ఈ ప్లాన్ అమలు చేయనున్నాం. ఇండస్ట్రియల్ అభివృద్ధితోపాటు పర్యాటక రంగాన్ని ఉపాధి రంగంగా అభివృద్ధి చేయడానికి టూరిజం విజన్ డాక్యుమెంట్ ద్వారా రుడా పరిధిలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. ఎక్కువ మందికి ఉద్యోగ ఉపాధికల్పనే లక్ష్యంగా ఈ ప్రాజెక్టు చేపడతాం. పీపీపీ విధానంలో రూపొందిస్తాం. రుడా పరిధిలో అఖండ గోదావరి ప్రాజెక్టు కింద ఇప్పటికే హేవలాక్, బ్రిడ్జిలంకకు నిధులు మంజూరయ్యాయి. మరో 16 ఐలాండ్‌లు, లేక్‌లు కూడా గుర్తించామని చెప్పారు. పిచ్చుకలంక, ఆత్రేయపురం లంకలు, అఖండగోదావరి లంకలు, పోలవరం ప్రాజెక్టు దిగువన సీతానగరం, కోరుకొండ మండలాల పరిధిలోని కొండలు కూడా పర్యాటకంగా అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. పురుషోత్తపట్నం ఆవను పర్యాటకంగా అభివృద్ధి చేయనున్నామన్నారు. వీటికి డీపీఆర్ తయారుచేయడానికి కన్సలెన్సీ ఎంపిక కోసం టెండర్లు పిలవనున్నట్టు చెప్పారు. రిసార్ట్స్, హోటళ్లు కూడా అభివృద్ధి చేస్తాం. రుడా ఆధ్వర్యంలో వాటిని ప్రమోట్ చేసి, ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్వహించనున్నట్టు వివరించారు. గతంలో రుడా నిధులతో నిర్మించిన రుడా పార్కులు, ఓపెన్ జిమ్‌లకు నిర్వహణ లోపం ఉంది. కేవలం ఒక్కొక్కటి రూ. 25 లక్షల కంటే ఎక్కువ నిధులతో వీటిని నిర్మించినప్పటికీ నిర్వహణ లేదు. పీఈటీలు, ప్రైవేట్ వ్యక్తుల నిర్వహణకు ఇస్తే ఎలా ఉంటుందనే ఆలోచన చేస్తున్నామన్నారు. రుడా పరిధిలో 1800 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, బీపీఎస్ కింద 200 దరఖాస్తులు ఉన్నాయన్నారు. సిబ్బంది అధికంగా అవసరం అవుతున్నారని, ఇప్పటికే మేళా నిర్వహించినా కూడా కొంతవరకూ మాత్రమే పరిష్కరించినట్టు చెప్పారు. ఒక భవనం కోసం వచ్చిన దరఖాస్తును పరిశీలించాలన్నా, మొత్తం లేఅవుట్‌ను పరిశీలిస్తేనే గానీ, సమస్య తేలడం లేదని తెలియజేశారు.

ల్యాండ్ పూలింగ్‌తో లేఅవుట్లు

ప్రజల నుంచి ల్యాండ్ పూలింగ్ చేసి రుడా లేఅవుట్లు అభివృద్ధి చేసే ప్రయత్నం చేస్తున్నాం. మా వైస్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్, రుడా అధికార్లతో ఇప్పటికే చర్చించాం. దీనివల్ల అన్ని మౌలిక సదుపాయాలతో లేఅవుట్లు వస్తాయి. రుడా పరిధిలోని అనధికార లేఅవుట్‌లకు ఇప్పటికే నోటీసులు ఇచ్చాం. అక్కడ ఏవిధమైన నిర్మాణాలు చేపట్టకూడదని కూడా స్పష్టం చేశాం.

మున్సిపాల్టీలు.. పంచాయతీల్లో రుడా షాపింగ్ కాంప్లెక్స్‌లు

మున్సిపాల్టీలు, పంచాయతీలు స్థలాలు చూపిస్తే రుడా నిధులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించడానికి నిర్ణయం తీసుకున్నాం. ఇప్పటికే కొవ్వూరు, రామచంద్రపురం మున్సిపాల్టీల నుంచి, వెస్ట్ గోనగూడెం నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. వీటిని నిర్మించిన తర్వాత వచ్చే ఆదాయం ఆయా సంస్థలతోపాటు రుడాకు కూడా లభించేలా చేస్తున్నాం.

మద్దూరులంక ప్రాంతంలో గాలింపు చర్యలు



బ్యారేజీ వద్ద పర్యవేక్షణ లోపం

అడ్డగట్ల వద్ద వేలాది మంది స్నానాలు.. ప్రాణాలు కోల్పోతున్న యువకులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

బ్యారేజీ వద్ద అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నిషేధిత స్థలాల్లో స్నానాలకు వెళ్లి అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రతీ ఏటా విషాద ఘటనలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. వేసవి కావడంతో సరదా కోసం అనేక మంది బ్యారేజీ దిగువ ప్రాంతంలోనూ, లాకుల వద్ద స్నానాలు చేస్తున్నారు. ఏకంగా మోటారు సైకిళ్ల వంటి వాహనాలను కూడా తీసుకెళ్లి ఫీట్లు చేస్తున్నారు. యువతతోపాటు మహిళలు, పెద్దలు, చిన్నపిల్లలు కూడా ఇక్కడ స్నానాలకు ఎగబడడం గమనార్హం. నిజానికి ఇవన్నీ నిషేధిత ప్రాంతాలు. ఇక్కడెవరూ స్నానం కూడా చేయకూడదు. కానీ అధికారులు పట్టించుకోకపోవడం వల్ల ఎండాకాలంలో ఇక్కడ జనం జలకాలాటలు ఎక్కువ అవుతున్నాయి. ధవళేశ్వరం నుంచి విజ్జేశ్వరం వరకూ గోదావరి కాటన్ బ్యారేజీకి 175 గేట్లు ఉన్నాయి. వీటి దిగువ కొంత నీరు ఉంటుంది. ఊట నీరు కూడా ప్రవహిస్తూ ఉంటుంది. గేట్ల వద్ద అఖండ గోదావరి వైపు ఎక్కువ నీరు ఉంటుంది. ఇది ప్రమాదకరమైన ప్రాంతం. అక్కడ కొందరు దూకి సాహసాలు చేస్తుంటారు. ఇక్కడ ఎక్కడ ఊబి ఉందో, ఎక్కడ గొయ్య ఉందో తెలియదు. దీంతో నూరేళ్లు బతకవలసిన పిల్లలు వాటిలో పడి అకాల మృత్యువుకు గురవుతున్నారు. వారి కన్నవారికి శోకం మిగులుతోంది. ఇప్పటికైనా అధికారులు పర్యవేక్షణ పెంచే చర్యలు తీసుకోవాలి.

గోదావరిలో స్నానానికి దిగి ఇద్దరు యువకుల గల్లంతు

7

నరసన్న కొండకు త్వరలో రోప్‌వే!

కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్.. ఫలించిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కృషి



కోరుకొండ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఎత్తైన కొండపైకి భక్తులు వెళ్లేందుకు రోప్‌వే ఏర్పాటుచేయాలన్న ఎన్నో ఏళ్ల ప్రతిపాదనకు ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ చేసిన ప్రయత్నాలు ఫలించడంతో ఈ ప్రాజెక్టుకు మోక్షం లభించింది. ఆంధ్రప్రదేశ్‌లో 5 పర్యాటక ప్రాంతాల్లో రోప్‌వేలు నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి తాజాగా సమాచారం అందింది. ఆంధ్రప్రదేశ్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఏపీ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలోనే ఏపీ పర్యాటక రంగం అభివృద్ధికి ఊతమిచ్చేలా కీలక అడుగుపడింది. ఆంధ్రప్రదేశ్‌లో ఐదుచోట్ల రోప్‌వే ప్రాజెక్టుల నిర్మాణానికి కసరత్తు జరుగుతోంది. ఇందులో భాగంగా సమగ్ర ప్రాజెక్టుల తయారీ నివేదికలో కన్సల్టెన్సీ సర్వీసుల కోసం టెండర్లు ఆహ్వానించారు. ఈమేరకు నేషనల్ హైవే ఆంధ్రప్రదేశ్‌లో రోప్‌వే ప్రాజెక్టుల తయారీకి డీపీఆర్ తయారీ కోసం టెండర్లును ఆహ్వానించింది. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన 5 రోప్‌వేల్లో ఒకటి చిత్తూరు జిల్లాలోని బోయికొండపై గంగమ్మ ఆలయం, కర్నూలు జిల్లాలోని అహోబిలం దేవస్థానం, పల్నాడులోని కోటప్పకొండ, విజయవాడలోని భవానీ ద్వీపం, తూర్పుగోదావరిలోని కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి కొండకు అనుమతి లభించింది. ప్రధానంగా రుకొండ లక్ష్మీనరసింహస్వామి కొండకు 0.25 కిలోమీటర్ల మేర రోప్‌వేను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లోని 25 పర్యాటక ప్రాంతాల్లో రోప్‌వేల నిర్మాణం కోసం ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ప్రణాళికలను రూపొందిస్తోంది. దీనివల్ల రాష్ట్రంలోని పర్యాటకులతోపాటు ఇతర రాష్ట్రాల్లోని పర్యాటకులను ఆకర్షించేలా ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేస్తారు.

7

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

భావోద్వేగాలు నిండిన చిత్రం



- ప్రదీప్ చిలుకూరి

'రాజా చెయ్యివేస్తే' ఫేమ్ ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. కల్యాణ్ రామ్ కథానాయకుడిగా నటించారు. ఎన్టీఆర్ ఆర్ట్ బేనర్‌పై అశోక్‌వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఈనెల 18న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు దర్శకుడు ప్రదీప్ చిలుకూరి. "కల్యాణ్‌రామ్‌తో ఓ మాస్ సినిమా చేద్దామని ఆలోచిస్తున్న సమయంలో ఓ ఆసక్తికరమైన ఐడియా పుట్టింది. వెంటనే ఆ లైన్‌ను కల్యాణ్‌రామ్‌కు చెబితే, ఆయనకు నచ్చింది. కానీ, అందులో తల్లి పాత్రలో విజయశాంతి నటిస్తేనే ముందుకు వెళ్దామని చెప్పారు. విజయశాంతికి కూడా తన పాత్ర నచ్చడంతో అంగీకరించారు. ఈ సినిమాలో క్లైమాక్స్ కీలకం. ఓ తల్లి కోసం తనయుడు ఏం చేసినా తక్కువే అని చూపించే పతాక సన్నివేశాలు ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తాయి. 'అమిగోస్', 'డెవిల్' లాంటి ప్రయోగాత్మక చిత్రాలు చేసిన తర్వాత కల్యాణ్‌రామ్ చేసిన పూర్తి స్థాయి యాక్షన్ చిత్రమిది. భావోద్వేగాలు, అద్భుతమైన పోరాట ఘట్టాలు గల ఈ సినిమా మాస్ ఆడియెన్స్‌తో పాటు కుటుంబ ప్రేక్షకులకూ నచ్చుతుంది. కల్యాణ్‌రామ్, విజయశాంతి మధ్య వచ్చే సన్నివేశాలు, సంభాషణలు, సంగీతం ఈ సినిమాకు ప్రధానాకర్షణ. తప్పకుండా విజయం సాధిస్తుంది" అని చెప్పారు.

సరికొత్త అనుభూతినిస్తుంది



- సంపత్‌నంది

దర్శకుడు సంపత్‌నంది దర్శకత్వ పర్యవేక్షణలో తెరకెక్కిన చిత్రం 'ఓదెల 2'. 2022లో విడుదలై ఘన విజయం సాధించిన 'ఓదెల రైల్వేస్టేషన్' చిత్రానికి ఇది సీక్వెల్. ఈ చిత్రానికి సంపత్ నంది కథను అందించి సమర్పకుడిగా వ్యవహరించారు. అశోక్ తేజ దర్శకత్వంలో మధు నిర్మించారు. ఈ నెల 17న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు సంపత్‌నంది. "ఈ సినిమా మొదటి భాగం తీస్తున్నప్పుడు పార్ట్ 2 గురించి ఆలోచించలేదు. కానీ చివరలో లీడ్ అయితే ఇచ్చాం. మొదటి భాగంలో హెబ్బా క్యారెక్టర్ సినిమాకే ప్లస్ అయ్యింది. అందుకే ఇందులో దుష్టశక్తితో పోరాడేందుకు ఓ బలమైన ఫీమేల్ క్యారెక్టర్ ఉంటే బాగుంటుందనిపించి తమన్నా పాత్రను సృష్టించాం. ఓ ఆత్మకు, సూపర్ నేచురల్ పవర్స్‌కు మధ్య జరిగే ఆసక్తికరమైన పోరు ఈ సినిమా కథాంశం. ప్రేక్షకులకు సరికొత్త విజువల్ అనుభూతిని పంచుతుంది. ఈ కథను రాసేందుకు చాలా పరిశోధన చేశాం. శివశక్తి, నాగసాధువులుగా మారతారని, శివాలయాలను శుద్ధి చేస్తారని.. ఇలా ఎన్నో విషయాలు తెలుసుకున్నాం. ఆ క్రమంలోనే ఈ సినిమాలో శక్తిమంతమైన నాగసాధు పాత్ర తయారైంది. తమన్నా ఇందులో తన లుక్ కోసం చాలా శ్రమించారు. సినిమాలో గ్రాఫిక్స్ పార్ట్ అధికంగా ఉంటుంది. ఆ విజువల్ ఎఫెక్ట్స్ ప్రేక్షకులకు థ్రిల్‌ను పంచుతాయి. దర్శకుడు అశోక్ ప్రతిభావంతుడు. ఆయన మేకింగ్ అదిరిపోతుంది" అని చెప్పారు.


మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది



నాని

నాని కథానాయకుడిగా 'హిట్ చిత్రాల ఫేమ్ శైలేష్ కొలను తెరకెక్కించిన చిత్రం 'హిట్ 3'. శ్రీనిధి శెట్టి కథానాయిక. వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. మే ఒకటిన చిత్రం విడుదలవుతోంది. ఇటీవలే విడుదలైన టీజర్, పాటలు సినిమాపై అంచనాలను తారస్థాయికి తీసుకెళ్లాయి. సోమవారం చిత్రట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ "ఈ మధ్య వస్తున్న సినిమాల ట్రైలర్‌లు ఆ సినిమాల విడుదలకు ఒక రోజో.. రెండు రోజుల ముందో వస్తున్నాయి. కానీ, ఒకప్పుడు ట్రైలర్‌లు సినిమా విడుదలకు 20 రోజుల ముందే విడుదల అయ్యేవి. అందుకే ఆ పాత రోజుల్ని గుర్తుచేయాలనే ట్రైలర్‌ను ముందుగానే విడుదల చేశాం. తెలుగు ప్రేక్షకులకు పరిచయం లేని ఓ సరికొత్త జానర్‌లో చేసిన చిత్రమిది. కొత్తగా ప్రయత్నించిన ప్రతీసారి ప్రేక్షకులు గెలిపించారు. మే ఒకటిన మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది. నేను యాక్షన్ సినిమాలు చేయాలని కోరుకునే వాళ్లంతా ఆ రోజు థియేటర్లకు వచ్చేయండి. నేను లవ్‌స్టోరీలు, ఫీల్ గుడ్, కామెడీ, కుటుంబ చిత్రాలు చేయాలనుకునే వారు ఆ రోజు కాస్త జాగ్రత్తగా ఉండండి. సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది. బలమైన భావోద్వేగాలతో నిండిన యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులకు పూనకాలు తెప్పిస్తాయి" అని చెప్పారు. "సినిమా యూనిక్‌గా ఉంటుంది. నాని నటన ఈ సినిమాను మరో లెవెల్‌కు తీసుకెళ్తుంది. ప్రతీ సన్నివేశం విజిల్స్ కొట్టేలా ఉంటుంది. 'అర్జున్ సర్కార్' ప్రేక్షకులకు చిరకాలం గుర్తుండిపోతాడు" అని దర్శకుడు శైలేష్ కొలను చెప్పారు.

విజువల్ వండర్



'అమరన్'తో సూపర్‌హిట్ అందుకున్న తమిళ నటుడు శివకార్తీకేయన్ నటిస్తున్న చిత్రం 'మదరాసి'. ఏ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో శ్రీలక్ష్మీ మూవీస్ నిర్మిస్తోంది. రుక్మిణీ వసంత్ కథానాయిక. విద్యుత్ జామ్వాల్, బిజు మీనన్, షబీర్, విక్రాంత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. సెప్టెంబరు 5న చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. విజువల్ వండర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్, సినిమాటోగ్రాఫర్: సుదీప్ ఎలామోన్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకు?



ఇండస్ట్రీలో హీరో, హీరోయిన్ ఒకేలా కష్టపడుతున్నప్పుడు పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకని నటి సమంత ప్రశ్నించారు. కథానాయికలు ఈ విషయంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నారని అన్నారు. సినీ పరిశ్రమలో నెలకొన్న ఈ అసమానతలపై సమంత ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'హీరో, హీరోయిన్ సమాన ప్రాతినిధ్యం ఉన్న పాత్రల్లో నటించినప్పటికీ పారితోషికం విషయంలో మాత్రం వ్యత్యాసం ఉంటోంది. పరిశ్రమలో నన్ను ఇబ్బందిపెట్టే విషయాల్లో ఇదొకటి. దీనిలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నా. గత పరిస్థితులను నేను మార్చలేను. మార్పు నాతోనే మొదలవ్వాలని నా సంస్థలో ఇలాంటి వ్యత్యాసం రాకుండా చూసుకుంటున్నాను' అని చెప్పారు.

బాలీవుడ్ చిత్రంలో పృథ్వీరాజ్



'ఎల్-2:ఎంపురాన్' చిత్రంతో దర్శకుడిగా విజయం సాధించారు మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్. ఇప్పుడు బాలీవుడ్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అధికారికంగా ప్రకటించారు. మేఘనా గుల్జార్ నిర్మించనున్న 'దైరా' అనే మూవీలో పృథ్వీరాజ్ శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనాకపూర్‌ని ఎంపిక చేశారు. ఈ సినిమా గురించి పృథ్వీరాజ్ మీడియాతో మాట్లాడుతూ 'స్క్రిప్ట్ వినగానే ఆసక్తిగా అనిపించింది. ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే పాత్ర నాది. నేను ఇండస్ట్రీకి వచ్చి 25 ఏళ్లు అయిన సందర్భంగా ఈ సినిమాలో నటిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఈ ప్రాజెక్టుపై కరీనా కూడా ఆనందం వ్యక్తం చేశారు' అని చెప్పారు.

ఏదో జరిగినే యెద లోపలా..



రాహుల్ విజయ్, నేహా పాండే జంటగా అశోక్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఖేల్ ఖతమ్ దర్వాజ బంద్'. వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై అర్జున్ దాస్యన్ నిర్మించారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా నుంచి 'ఏదో ఏదో..' అనే పాటను చిత్రబృందం సోమవారం విడుదల చేసింది. పూర్ణాచారి సాహిత్యానికి సురేశ్ బొబ్బిలి సంగీతం సమకూర్చారు. కార్తీక్, హరిణి ఆలపించారు. 'ఏదో ఏదో ఏదో జరిగెనే యెద లోపలా, ఏవో ఏవో కలలు విరిసినే, నిన్నా మొన్నా లేదే..' అంటూ ఆకట్టుకునేలా సాగుతుందీ పాట.

తమిళ భాషకు డిజిటల్ మెమోరియల్



ప్రపంచ ప్రాచీన భాషగా గుర్తింపు పొందిన తమిళానికి మరింత గుర్తింపు తెచ్చేలా 'డిజిటల్ మెమోరియల్'ని రూపొందించనున్నట్లు సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహ్మాన్ వెల్లడించారు. తమిళ నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన సందేశాన్ని వెల్లడిస్తూ, 'ప్రపంచ స్థాయి భాషలలో పరిణామం చెందుతూ అత్యంత శక్తిమంతమైన భాషగా తమిళం గుర్తింపు పొందింది. తమిళ భాషను ప్రపంచ వ్యాప్తం చేయడంలో తమిళ సంఘాల కృషి ముఖ్యమైనది. భాషను బలోపేతం చేయడంతో పాటు సవరణలు చేయడం ద్వారా దానిని సుసంపన్నం చేయడంలో ముఖ్యమైన పాత్రను పోషించాయి. వినూత్నమైన, అర్థవంతమైన మార్గాల్లో తమిళ భాషను తరువాతి తరానికి తీసుకెళ్ళాల్సిన బాధ్యత మనకుంది. తమిళ సాహిత్యం, సంస్కృతులను డిజిటలీకరణ చేసేందుకు, తమిళ భాషకు మరింత గౌరవం కల్పించేలా తమిళ సాహిత్యాన్ని వివిధ రూపాల్లో ప్రదర్శించేందుకు ఏఆర్ఆర్ ఇమ్మర్సివ్ ఎంటర్‌టైన్మెంట్ (ఏఆర్ఆర్ స్టూడియో) కృషి చేస్తుంది. తమిళ గౌరవాన్ని డిజిటల్ రెండరింగ్‌గా తయారు చేసేపనిలో నిమగ్నమై ఉంది. ఇది తమిళ భాష భవిష్యత్‌కు ఒక గర్వకారణంగా నిలుస్తుందని భావిస్తున్నాం' అని రెహ్మాన్ పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

జాట్ దర్శకుడికి తమిళుల హెచ్చరిక



బాలీవుడ్ హీరో సన్నీ డియోల్ హీరోగా తెలుగు దర్శకుడు గోపీచంద్ మలినేని తెరకెక్కించిన చిత్రం 'జాట్'. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. ఇటీవలె విడుదలైన ఈ చిత్రాన్ని బహిష్కరించాలని కోరుతూ సోషల్ మీడియా 'ఎక్స్'లో 'బాయ్‌కాట్ మూవీ' హ్యాష్ ట్యాగ్ వైరల్ అవుతోంది. ఎల్‌టీటీఈని ఒక ఉగ్రవాద సంస్థగా ఈ సినిమాలో చిత్రీకరించారంటూ కొందరు తమిళులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడులో అడుగుపెడితే దర్శకుడు గోపిచంద్ మలినేనికి తగిన బుద్ధి చెబుతామంటూ పోస్టులు పెడుతున్నారు. ఈ సినిమాలో ఎల్‌టీటీఈ పేరు ప్రస్తావించనప్పటికీ ఆ మార్క్ చూపుతూ సినిమా తీశారని కొందరు తమిళులు ఆరోపిస్తున్నారు.

వేశ్య పాత్ర... రీ ఎంట్రీ!



శివాజీ, నవదీప్, బిందు మాధవి ప్రధాన పాత్రల్లో మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'దండోరా'. లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై 'కలర్‌ఫొటో', 'బెదురులంక 2012' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన రవీంద్ర బెనర్జీ ముప్పానేని ఈ చిత్రానికి నిర్మాత. ఈ చిత్రం రెండో షెడ్యూల్ శరవేగంగా సాగుతోంది. 25 రోజులపాటు కొనసాగే చిత్రీకరణలో నటి బిందు మాధవి భాగమయ్యారు. చాలా కాలం తర్వాత బిందు మాధవి ఈ సినిమా ద్వారా రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో ఆమె వేశ్య పాత్రలో నటిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు మార్క్ కె.రాబిన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

హైకోర్టు న్యాయమూర్తుల పూజలు



భీమేశ్వరాలయంలో పూజలు చేస్తున్న జడ్జి మల్లికార్జునరావు దంపతులు

ద్రాక్షారామ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ, అన్నవరంలోని పలు ఆలయాల్లో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు సోమవారం పూజలు నిర్వహించారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామలోని భీమేశ్వరాలయాన్ని సోమవారం హైకోర్టు న్యాయమూర్తి టి.మల్లికార్జునరావు సతీ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శన అనంతరం వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. ముందుగా ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవానీ న్యాయమూర్తి దంపతులకు స్వాగతం పలికారు.

సత్యదేవుడి సన్నిధిలో..

అన్నవరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి వెంకట జ్యోతిర్మయి కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేయగా ఈవో స్వామివారి ప్రసాదం అందజేశారు.



సత్యదేవుడి దర్శనానంతరం జడ్జి వెంకట జ్యోతిర్మయి

ఇంటిల్లపాదికి ఆనందాన్ని పంచే..

అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి

సినీ హీరో ప్రదీప్ మాచిరాజు



అభిమానులతో మాట్లాడుతున్న హీరో ప్రదీప్

అమలాపురం టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి చిత్రం వేసవి సెలవుల్లో ఇంటిల్లపాదికి ఆనందాన్ని పంచుతుందని సినీ హీరో మాచిరాజు ప్రదీప్ పేర్కొన్నారు. తాను పుట్టిన ఊరులోనే ప్రేక్షకులతో కలిసి సినిమా చూడడం కొత్త అనుభూతిని ఇచ్చిందన్నారు. అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి చిత్రం ప్రదర్శిస్తున్న అమలాపురం శేఖర్ థియేటర్‌కు హీరో హీరోయిన్లు ప్రదీప్, దీపిక పిల్లి, దర్శకద్వయం నితిన్, భరత్‌ల బృందం సోమవారం రాత్రి వచ్చారు. ప్రేక్షకులతో కలిసి సినిమాను వీక్షించారు. తాను అమలాపురంలోనే పుట్టానని, ఇదే థియేటర్‌లో ఎందరో హీరోల సినిమాలను చూశానన్నారు. సినిమాను ఆదరించిన ప్రేకక్షకులకు కృతజ్ఞతలు తెలుపుకునేందుకు హైదరాబాద్ నుంచి వచ్చానని ప్రదీప్ మాచిరాజు చెప్పారు. కుటుంబ కథా చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారని ఈ చిత్రం ద్వారా మరోసారి రుజువు చేసినట్టు హీరోయిన్ దీపిక పేర్కొన్నారు.

నా ఆస్తి అమ్మైనా పేదరికాన్ని నిర్మూలిస్తా

అంబేడ్కర్ జయంతి సభలో కార్మిక శాఖ మంత్రి సుభాష్



కరప, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తన ఆస్తిని అమ్మైనా పేదరికాన్ని నిర్మూలిస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కాకినాడ జిల్లా కాజులూరు మండలంలో సోమవారం జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఆయన ఈ వ్యాఖ్య చేశారు. దీంతో అక్కడున్న నాయకులు చప్పట్లతో హర్షధ్వానాలు పలికారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ అంబేడ్కర్ కలను నెరవేర్చడానికి తన ఆస్తి అమ్మైనా రామచంద్రపురం నియోజకవర్గంలో ఒక్క పూరిగుడిసె లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

ఇంటర్ సీఈసీలో లీలాశ్రావణికి

రాష్ట్రంలో ప్రథమం

నేడు సత్కరించనున్న మంత్రి లోకేశ్



ఆర్.లీలాశ్రావణి

బిక్కవోలు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా పందలపాక జడ్పీ హెచ్ఎస్ ప్లస్‌లో చదివిన ఆర్.లీలాశ్రావణి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిందని హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఆమె సీఈసీ గ్రూపులో 943 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచింది. దీంతో పాటు ఆమె రాష్ట్రస్థాయిలో కూడా టాపర్‌గా నిలిచిందని పాఠశాల ఇంటర్ విద్యాశాఖ నుంచి మెసేజ్ వచ్చిందని ఆయన తెలిపారు. ఈమెను మంగళవారం అమరావతిలో జరిగే కార్యక్రమంలో విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ సత్కరించనున్నారని హెచ్ఎం శ్రీనివాసరెడ్డి తెలిపారు.

నేటి నుంచి ఏపీఎస్పీ

రేంజ్-1 స్పోర్ట్స్ మీట్

కాకినాడ రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట పంచాయతీ పరిధిలోని ఏపీఎస్పీ 3వ బెటాలియన్ మైదానంలో ఏపీఎస్పీ రేంజ్-1 గేమ్స్, స్పోర్ట్స్ మీట్‌ను మంగళవారం నుంచి ఈ నెల 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కమాండెంట్ ఎం.నాగేంద్రరావు తెలిపారు. మంగళవారం ఉదయం 7.30గంటలకు ప్రారంభమవుతాయని ఈ క్రీడోత్సవంలో 4 బెటాలియన్లకు చెందిన సుమారు 300మంది పోలీస్ క్రీడాకారులు 29ఈవెంట్లలో పాల్గొంటారన్నారు. పోటీల ముగింపుకార్యక్రమంలో బెటాలియన్స్ ఐజీపీ బి.రాజకుమారి, డీఐజీ కె.షకీరప్ప ముఖ్య, గౌరవఅతిథులుగా హాజరుకానున్నారని తెలిపారు.

ఎస్ఏ సీనియార్టీ జాబితాపై

అభ్యంతరాల స్వీకరణ

కాకినాడ రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఎస్జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ)ల పదోన్నతి, అదే విధంగా ఎస్ఏ నుంచి గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల పదోన్నతికి సంబంధించిన సీనియార్టీ జాబితాలను రూపొందించామని కాకినాడ డీఈవో పి.రమేష్ తెలిపారు. ఈ జాబితాలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పాఠశాల విద్యాశాఖ డీఈఓ.టీచ్రెజౌటజ వెబ్‌సైట్, నోటీస్ బోర్డులో మంగళవారం నుంచి అందుబాటులో ఉంటాయన్నారు. సంబంధిత జాబితాపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 17 సాయంత్రం 5గంటలలోపు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పాఠశాల విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని డీఈవో సూచించారు.

ఫ్రమ్ ది ఎర్త్.. టూ ది స్కైస్ పుస్తకావిష్కరణ



కాకినాడ కలెక్టరేట్‌లో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కాకినాడకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయిని ఈశ్వరమ్మ జీవిత చరిత్ర ఫ్రమ్ ఎర్త్ టూ స్కై.. పుస్తకావిష్కరణ కార్యక్రమం సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో జరిగింది. దీనికి రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు, రాష్ట్ర అకౌంటెంట్ ఆడిటర్ జనరల్ శాంతిప్రియ, ఈశ్వరమ్మ కుమారుడు మేఘాలయ రాష్ట్రానికి చెందిన సీనియర్ కలెక్టర్ సంపత్‌కుమార్, కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు, అమలాపురం మాజీ ఎంపీ బుచ్చి మహేశ్వరరావు, పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ నాగమణి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈశ్వరమ్మ దగ్గర విద్యనభ్యసించిన విద్యార్థులు ఆమెను ఘనంగా సత్కరించారు. అంబేడ్కర్ జయంతి రోజున ఈశ్వరమ్మ వంటి గొప్ప వ్యక్తుల జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించుకోవడం గొప్ప శుభపరిణామన్నారు. కార్యక్రమంలో ఈశ్వరమ్మ కుటుంబ సభ్యులు మంగాకుమారి, ప్రకాష్, జమీమా, ప్రముఖ పారిశ్రామికవేత్త సత్యశ్రీ శాస్త్రి, మంజు తదితరులు పాల్గొన్నారు.

నేల నుంచి నింగికి..

ఇది ఓ విశ్రాంత ఉపాధ్యాయిని జీవిత గాథ

(కాకినాడ- ఆంధ్రజ్యోతి): ఓ మహిళ తన జీవితంలో ఎదుర్కొన్న ఆటుపోట్లు.. ఓ పక్క ఉద్యోగ ధర్మాన్ని.. కుటుంబ భారాన్ని మోస్తూ.. తన పిల్లలను ఎలా వృద్ధిలోకి తీసుకొచ్చింది.. ఉపాధ్యాయురాలిగా ఆమె అనుభవాలు.. నేర్చుకున్న, నేర్పిన పాఠాలు.. జీవితంలో తాను ఓ స్థాయికి రావడానికి తన తల్లిదండ్రులు అందించిన ప్రోత్సాహం.. రవాణా సౌకర్యాలు లేని సమయంలో కిలోమీటర్లు కొద్ది కాలినడకన నడిచిన రోజులు.. వసతి గృహాల్లో వందలాది మంది విద్యార్థుల మధ్య గడిపిన క్షణాలు.. ఇలా అనేక విశేషాలను వివరిస్తూ.. కాకినాడ జిల్లాకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు ఈశ్వరమ్మ రాసిన ఆత్మకథే.. ఫ్రం ది ఎర్త్.. టు ది స్కైస్ (నేల నుంచి నింగికి..).. తాను జీవితంలో ఉన్నత స్థానంలో నిలవడమే కాదు.. తన నలుగురి సంతానాన్ని ప్రయోజకులుగా చేశారు ఆమె. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పత్తిగొంది గ్రామంలో చక్రం, ఆదెమ్మ దంపతులకు 1944 ఆగస్టు 18న జన్మించిన ఈశ్వరమ్మ.. కాకినాడలో ఎస్ఎల్‌సీసీ పూర్తి చేశారు. 1959లో టీచర్ ట్రైనింగ్ పూర్తి చేశారు. అదే సమయంలో ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యంను వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు నలుగురు కుమారులు. అందులో మూడో తనయుడు సంపత్‌కుమార్ సీనియర్ ఐఏఎస్ అధికారి, ప్రస్తుతం మేఘాలయ రాష్ట్రంలో హెల్త్ సెక్రటరీగా పనిచేస్తున్నారు. కోడలు సత్యశ్రీ పారిశ్రామిక వేత్త, నాలుగో కుమారుడు ఈశ్వరశాస్త్రి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఉద్యోగి, కోడలు జిల్లా మార్క్‌ఫెడ్ ఏడీ కావడం విశేషం.

అయ్యప్ప సన్నిధిలో విషు పండుగ



స్వామివారికి చక్రస్నానం చేయిస్తున్న దృశ్యం

శంఖవరం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కేరళ నూతన సంవత్సర వేడుకైన విషు పండగను ఆంధ్రా శబరిమలై సన్నిదానంలో కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ కూసుమంచి శ్రీనివాసరావు గురుస్వామి ఆధ్వర్యంలో వేకువజాము నుంచి పలు విశేషకరమైన హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవమూర్తులను ఊరేగించారు. పదునెట్టాంబడిపై స్వామివారిని తీసుకుని వచ్చి చక్రస్నానమాచరింపజేశారు. స్వామివారికి ముత్యాలతో అభిషేకాలు నిర్వహించి, భక్తులకు దర్శనాలు అందజేసారు. భారీస్థాయిలో హాజరైన భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

పుదుచ్చేరి రాజ్‌నివాస్‌కు బాంబు బెదిరింపు

అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం

యానాం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ నివాసం, కార్యాలయం (రాజ్‌నివాస్)కు గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చింది. సోమవారం గవర్నర్ కైలాస్‌నాథన్ పలు ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరయ్యారు. దీంతో గవర్నర్ సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తమై పెరియాకడై పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో బాంబ్ స్క్వాడ్ వచ్చి తనిఖీలు చేపట్టారు. ఎటువంటి బాంబు లేదని తేల్చారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈఫేక్ కాల్‌గా భావించారు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు. గతంలో బెదిరింపులకు పాల్పడిన వ్యక్తే ఇప్పుడు బెదిరింపులకు పాల్పడినట్టు అనుమానిస్తున్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై

దశలవారీ పోరాటం

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై దశలవారీ పోరాటం సాగిస్తామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. సోమవారం రాజకీయ ప్రచార జాత ముగింపు సభ నిర్వహించారు. డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సభలో అక్కినేని వనజ మాట్లాడుతూ ప్రతి కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు రాజకీయ సైద్ధాంతిక అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లుగా విభజించి కార్మికులకు అన్యాయం చేస్తున్నదని విమర్శించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ అమ్మే ప్రయత్నాలను అడ్డుకుంటామని అన్నారు. కేంద్రంలో నియంతృత్వ పాలన సాగిస్తున్న మోదీ ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలవడం సిగ్గుచేటని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కుండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి కొండలరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఈకే.. నాట్ ఓకే!

- ఉమ్మడి 'తూర్పు'లో నత్తనడకన ఈకేవైసీ నమోదు క్రతువు
- ఈ నెలాఖరుతో గడువు పూర్తి
- ఇప్పటివరకు 45.24 లక్షల మందికి పూర్తి
- ఇంకా నమోదు కావాల్సినవారు 3లక్షల 23వేలమంది
- సహకరించని సచివాలయాల సిబ్బంది, రేషన్‌డీలర్లు



కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుల్లో ఉన్న సభ్యుల వివరాలను ఈకేవైసీలో నమోదు చేసే క్రతువు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నత్తనడకన సాగుతోంది. ఇటు రేషన్‌డీలర్లు, ఎండీయూ వాహనాల ఆపరేటర్లు, గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బంది సహకరించకపోవడంతో ఈ పోస్ ద్వారా నమోదు నెమ్మదించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లో రేషన్‌కార్డుల్లో 49లక్షల34వేలమంది సభ్యులు ఉన్నారు. వీరిలో ఇప్పటివరకు 45లక్షల 24వేల మంది వివరాలను ఈకేవైసీ చేశారు. ఇంకా 3 లక్షల23 వేలమంది రేషన్‌కార్డు సభ్యుల వివరాలను నమోదు చేయాల్సి ఉంది. రేషన్‌షాపు డీలర్లు, ఎండీయూ వాహనాల ఆపరేటర్లు, గ్రామవార్డు సచివాలయాల సిబ్బంది సహకరించకపోవడం వల్ల ప్రక్రియ నత్తనడకన సాగుతుంది. దీనిలో ఐదేళ్లలోపు చిన్నారులు, 80ఏళ్ల దాటిన వృద్ధులకు మినహాయింపు ఇచ్చారు. వీరి సంఖ్య 86700 మంది ఉన్నారు. దీంతో వీరి వివరాలను ఈకేవైసీ చేయనవసరం లేదు. ఈకేవైసీ ప్రక్రియను ఈనెల 30వ తేదీలోపు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో నమోదు జరగడం లేదు. గతనెల 11 నుంచి 31 వరకు తొలివిడత ఈకేవైసీ నమోదు జరిగింది. పెద్దఎత్తున నమోదు పెండింగ్ ఉండడంతో కేంద్రప్రభుత్వం ఈనెల 30వ తేదీ వరకు గడువు పెంచింది.

ప్రత్యేక ఆదేశాలు ఇవ్వాలి

ఈకేవైసీ నమోదు ప్రక్రియ వేగవంతం అయ్యేలా రేషన్‌డీలర్లు, ఎండీయూ వాహనాల ఆపరేటర్లకు, గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు ఆయా జిల్లాల జాయింట్ కలెక్టర్లు ప్రత్యేకంగా ఆదేశాలు ఇవ్వాల్సి ఉంది.

కాకినాడ జిల్లాలో..

జిల్లాలో 18 లక్షల 31వేలమంది రేషన్ కార్డు సభ్యుల వివరాలను ఈకేవైసీ చేయాల్సి ఉంది. వీరిలో ఇప్పటివరకు 16 లక్షల 64వేలమంది వివరాలు నమోదు చేశారు. ఇంకా లక్షా 36 వేలమంది వివరాలు నమోదు చేయాల్సి ఉంది. ఐదేళ్లలోపు చిన్నారులు, 80ఏళ్ల దాటిన వృద్ధులు 30 వేల మంది వివరాలు నమోదు చేసే అవసరంలేదు. వీరికి మినహాయింపు ఇచ్చారు.

తూర్పుగోదావరి జిల్లాలో..

ఈ జిల్లాలో 15లక్షల77వేలమంది రేషన్ కార్డులో సభ్యులు వివరాలు ఈకేవైసీ చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 14 లక్షల 58వేల వివ రాలు నమోదు చేశారు. ఇంకా 92,620 మంది వివరాలు ఈకేవైసీ చేయాల్సిఉంది. రేషన్‌డీలర్లు, ఎండీయూ వాహనాల్లో ఆశించిన స్థాయిలో న మోదు జరగడంలేదని రేషన్‌దారులుంటున్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో..

ఈ జిల్లాలో 15లక్షల25వేలమంది రేషన్‌కార్డుల్లో సభ్యులు వివరాలను ఈకేవైసీ చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 14లక్షల వెయ్యిమంది వివరాలు నమోదయ్యాయి. ఇంకా 94వేలమంది వివరాలు పెండింగ్‌లో ఉన్నాయి.

గోదావరిలో స్నానానికి దిగి
ఇద్దరు యువకుల గల్లంతు

- బయపడిన మరో యువకుడు
- గాలింపు చర్యలు చేపట్టిన పోలీసు, ఫైర్, రెవెన్యూ అధికారులు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన మంత్రి దుర్గేష్, ఆర్డీవో, డీఎస్పీ





ప్రకాష్‌కుమార్, హర్ష (ఫైల్‌ఫొటోలు)



గోదావరిలో యువకుల కోసం గాలిస్తున్న పోలీసులు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్

కొవ్వూరు/, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం మద్దూరు లంక గ్రామంలోని చిగురులంక వద్ద గోదావరి నదిలో స్నానానికి దిగి ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. సోమవారం మధ్యాహ్నం సమయంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న ముగ్గురు యువకులైన నిడదవోలు చర్చిపేట నుంచి రత్నదీప్, మత్తి ప్రకాష్‌కుమార్ (15), రాజమహేంద్రవరానికి చెందిన గంధం హర్ష (18) మద్దూరులంక వద్ద బ్యారేజ్ దిగువన స్నానానికి దిగారు. నదీ లోతుగా ఉండడంతో ప్రమాదవశాత్తు మునిగిపోతుండగా అక్కడే ఉన్న నిడదవోలుకు చెందిన మరో ఆరుగురు యువకులు రక్షించే ప్రయత్నంచేశారు. వారిలో దివాకర్ అనే యువకుడు రత్నదీప్‌ను రక్షించాడు. మిగిలిన ఇద్దరు గల్లంతయ్యారు. సమాచారం తెలుసుకున్న పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఆర్డీవో డా.రాణి సుస్మిత, డీఎస్పీ జి.దేవకుమార్, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, రూరల్ ఎస్‌ఐ కె.శ్రీహరిరావు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానిక జాలర్లు, ఫైర్ సిబ్బందితో గోదావరిలో అర్ధరాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టారు. మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఎంతో భవిష్యత్ ఉన్న యువకులు ప్రమాదవశాత్తు నదిలో గల్లంతవ్వడం బాధాకరమన్నారు. తల్లితండ్రులను చూస్తుంటే గుండె తరుక్కుపోతుందన్నారు. గల్లంతైనవారిని వెలికితీయడానికి కాకినాడ నుంచి ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను, గజఈతగాళ్లను రప్పిస్తున్నామన్నారు. సంఘటనా స్థలమంతా యువకుల తల్లితండ్రులు, బంధువుల రోదనలతో నిండిపోయింది.

ఉదయమంతా చలాకీగా తిరిగి.. మధ్యాహ్నానికి మాయమై...

నిడదవోలు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం మద్దూరులంక వద్ద గోదావరిలో గల్లంతైన ఇద్దరిలో ఒకరు మత్తి ప్రకాష్‌కుమార్ (15) నిడదవోలు చర్చిపేటకు చెందినవాడు కావడంతో అక్కడ విషాదచాయలు అలుముకున్నాయి. ఇటీవల పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాశాడు. సోమవారం అంబేడ్కర్ జయంతి ఉత్సవాల అనంతరం స్నేహితులతో కలిసి మద్దూరులంకలో గోదావరి స్నానానికి వెళ్లి గల్లంతయ్యాడు. తల్లి ఉపాధి నిమిత్తం కువైట్ వెళ్లగా, తండ్రి ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఉదయం నుంచి తమతో ఎంతో చలాకీగా తిరిగిన ప్రకాష్‌కుమార్ గోదావరిలో గల్లంతయ్యాడని తెలిసి స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

ఇసుక లారీ బోల్తా

డ్రైవర్ మృతి
క్లీనర్‌కు తీవ్ర గాయాలు



చెట్టును ఢీకొని బోల్తాపడిన ఇసుక లారీ



లారీ కింద ఇరుక్కుని మృతిచెందిన శ్రీనివాసరావు



క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన క్లీనర్ పిల్లి శ్రీనివాసు

కరప, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాజులూరు మండలం జగన్నాధగిరి ప్రధాన రహదారిపై సోమవారం ఉదయం ఇసుక లారీ బోల్తాపడి డ్రైవర్ మృతిచెందగా క్లీనర్ తీవ్రంగా గాయపడ్డాడు. గొల్లపాలెం పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కరప మండలం నడకుదురు గ్రామానికి చెందిన రావుల శ్రీనివాసరావుకు చెందిన లారీపై రామచంద్రపురం మండలం ద్రాక్షారామ శివారు వేగాయమ్మపేటకు చెందిన పిల్లి శ్రీనివాసు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరు తరచూ కోటిపల్లి, కపిలేశ్వరపురం ర్యాంపుల నుంచి కాకినాడ తదితర ప్రాంతాలకు ఇసుక తరలిస్తుంటారు. అయితే సోమవారం క్లీనర్ సెలవు పెట్టడంతో లారీ ఓనర్ రావుల శ్రీనివాసరావు(50) డ్రైవర్ పిల్లి శ్రీనివాసును పక్క సీటులో కూర్చోమని డ్రైవింగ్ తీసుకున్నాడు. ఇసుక లోడుతో జగన్నాధగిరి కెనాల్ రోడ్డుకు వచ్చేసరికి లారీ అదుపు తప్పి రోడ్డుపక్కన ఉన్న భారీవృక్షాన్ని ఢీకొని బోల్తాపడింది. లారీ వేగానికి ఆ చెట్టు వేళ్లతో సహా కుప్పకూలిపోయింది. ఈ ప్రమాద ధాటికి ఇసుక లారీ ముక్కముక్కలుగా విరిగిపోయింది. ఈ ప్రమాదంలో రావుల శ్రీనివాసరావు లారీ కింద చిక్కుకుని అక్కడికక్కడే మృతిచెందగా పిల్లి శ్రీనివాసు తీవ్రంగా గాయపడి క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. స్థానికులు, పోలీసుల సాయంతో అతడ్ని బయటకు లాగి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గొల్లపాలెం ఎస్‌ఐ ఎం.మోహన్‌కుమార్ కేసు నమోదు చేసిదర్యాప్తుచేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



నాగేశ్వరరావు (ఫైల్)

రౌతులపూడి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం గిడజాం గ్రామానికి చెందిన య ర్రా నాగేశ్వరరావు(38) మృతిచెందాడు. వి వ రాల ప్రకారం.. కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నాగేశ్వరరావు రోజులాగే సోమవారం బిబి పట్నం శివారు పామ్‌ఆయిల్ తోటలోకి పనికి వెళ్లాడు. పామ్‌ఆయిల్ గెలలు కోసిన తరువాత అదే కత్తితో తాటాకు కోస్తుండగా 12 కేవీ విద్యుత్ వైర్ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. నాగేశ్వరరావుకు భార్య, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. ఇద్దరు ఆడ పిల్లలతో ఎలా బతకాలి అంటూ భార్య గన్నమ్మ కన్నీరు మున్నీరు అయ్యింది. ఎస్‌ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియాసుపత్రికి తరలించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



అన్నవరం/గొల్లప్రోలు ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం మల్లవరం రై ల్వేగేటు సమీపంలో సోమవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైందని రైల్వే హెచ్‌సీ శ్యామ్ తెలిపారు. మృతదేహం వద్ద ఏఆనవాలు లేవని, సుమారు 45 ఏళ్లు ఉంటాయని... కుడి, ఎడమ చెయ్యి వద్ద పెద్ద టాటూ ఉన్నాయని పేర్కొన్నారు. మృతదేహాన్ని రైల్వే ఎస్‌ఐ శ్రీనివాసరావు ఆదేశాలతో తుని ప్రభుత్వాసుపత్రిలో భద్రపరిచామని, సంబంధీకులు ఎవరైనా ఉంటే తుని రైల్వే పోలీసులు, 9490619020కు సమాచారం అందించాలని ఎస్‌ఐ కోరారు.

ఒక్కసారి లే కన్నా...

తల్లడిల్లిన తల్లి
బైక్ అదుపుతప్పి ఆటోను ఢీకొని కుమారుడి మృతి



సోమేశ్వరంలో కుమారుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి నాగమణి

రాయవరం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళ్లిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో మృతదేహం వద్ద తల్లి ఒక్కసారి లేకన్నా అంటూ రోదించిన ఘటన కంటతడి పెట్టించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం సోమేశ్వరం శెట్టిబలిజపేట సమీప ప్రాంతానికి చెందిన దడ్డు సందీప్(16) సోమవారం గ్రామంలో తెలిసిన వ్యక్తి నుంచి బైక్ తీసుకుని మధ్యాహ్న సమయంలో ఇంటి నుంచి బైక్‌పై బయటకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా సోమేశ్వరం శివారు పప్పుల మిల్లుకు సమీపంలోకి వచ్చేసరికి బైక్ అదుపు తప్పిపడిపోవడంతో పాటు రోడ్డుపై ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొని సందీప్ సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. సందీప్ స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివి ఇటీవల పదో తరగతి పరీక్షలు రాశాడు. ఈ సంఘటనతో సోమేశ్వరంలో విషాదచాయలు అలుముకున్నాయి. ఒక్కగానొక్క కుమారుడి మృతితో తల్లి నాగమణి కన్నీరుమున్నీరుగా విలపించింది. సంఘటనా స్థలాన్ని రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, సీఐ దొరరాజు, ఎస్‌ఐ సురేష్ బాబు పరిశీలించారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

మోటార్‌సైకిళ్లు ఢీ: యువకుడి మృతి

మరో నలుగురికి గాయాలు

కొత్తపల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ- కోనపాపపేట రోడ్డులో ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు అందించిన సమాచారం మేరకు.. అనకాపల్లి జిల్లా కొత్తకోట గ్రామానికి చెందిన ఎద్దు దుర్గాప్రసాద్(25) కెఎస్‌ఈజెడ్‌లో సంధ్య రొయ్యల శుద్ధి పరిశ్రమలో పనిచేస్తున్నాడు. తనతోపాటు పనిచేస్తున్న నవదీప్, నవీన్‌లతో కలిసి ఆదివారం రాత్రి మోటార్‌సైకిల్‌పై మెస్ నుంచి వస్తున్నారు. ఉప్పాడ వైపు నుంచి మో టార్ సైకిల్‌పై మరో ఇద్దరు వ్యక్తులు బీచ్‌రోడ్డులో కోనపాపపేట వైపు వెళ్తుండగా కెఎస్‌ఈజెడ్ సమీపంలో పరిశ్రమలకు వెళ్లే రోడ్డులో ప్రమా దవశాత్తూ ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో దుర్గాప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందగా నలు గురికి గాయాలయ్యాయి. వారిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్‌ఐ జీ.వెంకటేష్ తెలిపారు.

పిడుగుపాటుకు 16 పశువుల మృతి



మేడిగట్టులో మృతిచెందిన పశువులు

ఎటపాక, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఎటపాక మండలం రాయనపేట పంచాయతీ పరిధి వలస గ్రామం మేడిగట్టులో చెట్టు కింద సేదతీరుతున్న పశువులపై ఆదివారం సాయంత్రం పిడుగుపడి ఆదివాసీ రైతులకు చెందిన 7 ఎద్దులు, 8 ఆవులు మృతి చెందాయి. స్థానిక వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి మృతి చెందిన పశువులను పరిశీలించారు. ఇదిలా ఉంటే కృష్ణవరం గ్రామంలో పిడుగుపాటుకు పద్దం కృష్ణకు చెందిన పశువు మృతి చెందింది.

కాలిన కొబ్బరిచెట్లు

అంతర్వేది, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా సఖినేటిపల్లి లూథరన్ హైస్కూలు వెనక కొబ్బరి తోటలో ఆదివారం రాత్రి అకాల వర్షానికి పిడుగు పడింది. దీంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు. పిడుగు పాటుకు కొబ్బరిచెట్లు కాలిపోయాయి.

రమణక్కపేటలో అశ్లీల నృత్యాలు

కొత్తపల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం రమణక్కపేటలో విజయజనార్ధన స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అమ్మాయిలతో అశ్లీల నృత్యాలు ప్రదర్శించారు. ఉత్సవాలను కూటమి నాయకుల సమక్షంలో నిర్వహించారు. భక్తి కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉండగా అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేయడం పట్ల పలువురు గ్రామస్తులు కమిటీ నాయకుల వైఖరిని దుయ్యబట్టారు. దీనిపై పోలీసులు చర్యలు తీసుకోకుండా మౌనం దాల్చడం పట్ల పోలీసుల వైఖరిని పలువురు విమర్శించారు.

చీడిగలో చోరీ

23 గ్రాముల బంగారం, రూ.5వేలు నగదు అపహరణ

కాకినాడ రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం చీడిగలోని గుడాలవారి సత్రం రోడ్డులో గల సూరాడ నరేంద్ర ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి 23 గ్రాముల బంగారం, రూ.5వేలు నగదు అపహరించినట్టు ఇంద్రపాలెం ఎస్‌ఐ ఎ.వీరబాబు తెలిపారు. నరేంద్ర పాతర్లగడ్డలోని ఆక్వా కంపెనీలో పనిచేస్తాడు. ఈ నెల 12న మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి ప్రాంతంలోని తన అత్తవారింటికి వెళ్లి సోమవారం మధ్యాహ్నం తిరిగి వచ్చేసరికి తాళం కప్ప బద్దలు కొట్టి తలుపులు తెరచి ఉన్నాయి. దీంతో ఉలిక్కిపడి కంగారుగా ఇంటిని పరిశీలించగా బంగారం, నగదు అపహరించినట్టు గుర్తించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కొవ్వూరులో అదృశ్యం... హైదరాబాద్‌లో ప్రత్యక్షం...

అత్తింటి నుంచి వెళ్లిపోయిన మహిళ

కొవ్వూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు. వివరాల ప్రకారం... కాకినాడ జిల్లా పెద్దాపురం శంకరయ్యపేటకు చెందిన వీరవాసరపు యేసురత్నం వేసవి సెలవుల నిమిత్తం కొవ్వూరు అత్తగారింటికి వచ్చింది. ఈ నెల 14వ తేదీ ఉదయం మూడు గంటల సమయంలో ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. దీంతో చుట్టుపక్కల ఉన్న బంధువుల ఇళ్లకు వెళ్లి వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అత్త వీరవాసరపు దుర్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా, మహిళ హైదరాబాద్‌లో ఉన్నట్టు గుర్తించినట్టు సీఐ విశ్వం తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గండేపల్లి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట గ్రామ శివారు పోలవరం గట్టుపై పేకాట ఆడుతున్నట్టువారిపై సోమవారం ఎస్‌ఐ యువి శివనాగబాబు, సిబ్బంది దాడి చేశారు. ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.10,400 నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

గుట్టు రట్టు!

- కలుషితాహారం తిని 28 మందికి అస్వస్థత, 3 రోజులుగా జగ్గంపేటలో చికిత్స
- విషయం బయటకు తెలియజేయని అవంతి ఫ్రోజెన్ ఫుడ్స్ యాజమాన్యం
- బాధితుల వద్దకు వెళ్లిన కాకినాడ డీఎమ్‌హెచ్‌వో, ఫ్యాక్టరీలో తనిఖీలు



అవంతి పరిశ్రమలో తాగునీటిని పరిశీలిస్తున్న డీఎమ్‌హెచ్‌వో, అధికారులు



జగ్గంపేటలో చికిత్స పొందుతున్న బాధితులు

జగ్గంపేట/ఏలేశ్వరం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి అవంతి ఫ్రోజెన్ ఫుడ్స్‌లో కలుషితాహారం తిని 28మంది అస్వస్థతకు గురయ్యారు. అయితే వారిని గత 3రోజుల క్రితమే జగ్గంపేట ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. అప్పటి నుంచి విషయం బయటకు పొక్కకుండా అవంతి యాజమాన్యం గుట్టుగా ఉంచింది. అయితే సోమవారం ఈ విషయం మీడియా ద్వారా బయటకు రావడంతో జగ్గంపేటలో ఆ ఆసుపత్రిని జిల్లా వైద్యశాఖాధికారి నరసింహనాయక్ పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. సుమారు 25 నుంచి 30 మంది అస్వస్థతకు గురైనట్టు తెలిపారు. మైనర్ పాయిజన్‌గా కావడంతో ప్రమాదం తప్పిందని, ప్రస్తు తం ఎటువంటి ప్రమాదం లేదన్నారు. 15 మంది డిశ్చార్జి కాగా ప్రస్తుతం ఆసుపత్రిలో 12 మంది ప్రాథమిక చికిత్స పొందుతున్నారని తెలిపారు. వారి పరిస్థితి నిలకడగానే ఉందని ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. వారిని కూడా మంగళవారం లోపు డిశ్చార్జి చేసే అవకాశముందన్నారు. దీనిపై విచారణ చేపట్టి సమగ్ర నివేదిక ప్రభుత్వానికి అందిస్తామని వెల్లడించారు. అవంతి సీఫుడ్స్ పరిశ్రమ, క్యాంటీన్‌ను డీఎమ్ హెచ్‌వో, అధికారులు పరిశీలించారు. సుమారు 1000 మంది వరకు రోజూ క్యాంటీన్‌లో ఆహారం తింటారని తెలిసిందన్నారు. తాగునీరు పైపు లైన్‌కు సంబంధించి లీకేజీ గుర్తించినట్టు తెలిపారు. తాగునీరు తదితర అంశాల్లో స్వల్ప లోపాలు ఉన్నాయని, వీటిపై పరిశ్రమకు నోటీసులు అందజేస్తామన్నారు. ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు తహశీల్దార్, వైద్యులకు తెలపాలన్నారు. డీఎమ్‌హెచ్‌వో వెంట అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్, వైద్యాధికారి శ్రీలక్ష్మీ, టి.వీరన్న ఉన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, బస్వా ప్రసాద్, ఫైరాల కనకారావు కలిసి వివరాలు తెలుసుకున్నారు.

అగ్నిప్రమాద రహిత సురక్షిత
దేశం కోసం ఐక్యమవుదాం

ఫైర్ సర్వీసెస్ డీజీ మాదిరెడ్డి ప్రతాప్



రాజమహేంద్రవరంలో అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభిస్తున్న డీజీ మాదిరెడ్డి ప్రతాప్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని, అగ్ని ప్రమాద రహిత సురక్షిత భారతదేశం కోసం ఐక్యమవుదామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్ పేర్కొన్నారు. సోమవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఇన్నీసుపేట అగ్నిమాపక సేవల కేంద్రం వద్ద అగ్నిమాపక వారోత్సవాలను ఆయన పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. తొలుత బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ 14 నుంచి 20 వరకూ అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. కేంద్రం రాష్ట్రవ్యాప్తంగా 160 అగ్నిమాపక వాహనాలను మంజూరు చేసిందన్నారు. తూర్పుగోదావరిలో రాజమహేంద్రవరం రూరల్, దేవరపల్లిలో మోడల్ ఫైర్ స్టేషన్లు రానున్నాయని ఆయన తెలిపారు. అగ్నిమాపక సేవల శాఖ ప్రాంతీయ అధికారి ఇ.స్వామి మాట్లాడుతూ కొత్త అగ్నిమాపక కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.250కోట్లు కేటాయింపు చేయగా.. తొలి విడతగా రూ.153కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. గత ఆర్థిక ఏడాదిలో రీజియన్ పరిధిలో 2021 నుంచి మొత్తం 14,732 ఫైర్ కాల్స్ వచ్చాయన్నారు. రూ.550 కోట్ల ఆస్తినష్టం జరగ్గా, రూ.1,335 కోట్ల ఆస్తిని బుగ్గిపాలు కాకుండా కాపాడగలిగామని వివరించారు. అలాగే 410 మంది ప్రాణాలు కోల్పోగా 601 మందిని రక్షించామని చెప్పారు. కార్యక్రమంలో చీఫ్ ఫైర్ ఆఫీసర్ సీహెచ్ మార్టిన్ లూథర్ కింగ్, ఏడీఎఫ్‌వో శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పంట కాలువలను ఆక్రమిస్తే
కేసులు నమోదు చేస్తాం

కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ హెచ్చరిక

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎవరైనా పంట కాలువలను పూడ్చినా, ఆక్రమించిన అటువంటి వారిపై కేసులు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ హెచ్చరించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. గండేపల్లి మండలం నాయకంపల్లి వద్ద మర్రిపూడి చాగల్నాడు కాల్వను 500మీటర్ల పొడవున, 10మీటర్ల వెడల్పున పూడ్చి పంట పొలంగా మార్చుకుని దిగువన 5గ్రామాల్లోని 5వేల ఎకరాలకు నీటి సరఫరాకు అవరోధం కల్పించిన బిక్కిన సూర్యనారాయణ చౌదరి అనే వ్యక్తి పై క్రిమినల్ కేసు నమోదుకు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నాయకంపల్లి వెంకటాపురం, కోట పాడు, దొడ్డిగుంట, సింగంపల్లి, మర్రిపూడి గ్రామాల రైతుల ఫిర్యాదు ఆధారంగా చాగల్నాడు కాల్వను అక్రమంగా పంటపొలంగా మార్చుకున్న బిక్కిన సూర్యనారాయణ చౌదరిపై పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదు చేసి ఎఫ్‌ఐఆర్ బుక్ ఫైల్ చేశారు.

శివకోడు జాతీయ రహదారిపై
స్కూటర్ దగ్ధం

రాజోలు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం శివకోడు 216 జాతీయ రహదారిపై సోమవారం షార్ట్ సర్క్యూట్ వల్ల స్కూటర్ దగ్ధమైందని రాజోలు ఎస్‌ఐ బి.రాజేష్‌కుమార్ తెలిపారు. వివరాల ప్రకారం.. మామిడికుదురు మండలం నగరం నుంచి తల్లి మాధవి కూతురితో మలికిపురం మండలం మేడిచర్లపాలేనికి సుజికీ యాక్సెస్ స్కూటర్‌పై వెళ్తుండగా శివకోడు జాతీయ రహదారిపై చింతలపల్లి బస్టాప్ వద్దకు వచ్చేసరికి స్కూటరుపై ముందు నిలుచున్న కూతురు కాలు కాలుతున్నట్టు చెప్పడంతో ఆగి చూసేసరికి ఒక్కసారి స్కూటర్ నుంచి మంటలు వ్యాపించి దగ్ధమైంది. వెంటనే స్థానికులు రాజోలు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. ఎస్‌ఐ రాజేష్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.



స్కూటర్ నుంచి వస్తున్న మంటలను ఆర్పుతున్న స్థానికులు

వ్యక్తిని గాయపర్చిన ఇద్దరిపై కేసు

కొవ్వూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిని కొట్టి గాయపర్చిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఎం.సత్యనారాయణ తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం దొమ్మేరు సావరంలో మట్టే విశ్వనాధం ఇంటి ముందు ఇసుకగుట్ట వేశాడు. దారిలో అడ్డంగా ఉందని అందరూ జారిపడుతున్నారని గ్రామానికి చెందిన ఈదర మురళీ అడిగాడు. దీంతో విశ్వనాధం, అతడి కుమారుడు రాజశేఖర్‌లు మురళీని కొట్టి గాయపర్చారు. గాయలైన మురళీని చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సమాచారం మేరకు మురళీ ఫిర్యాదుతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎం సత్యనారాయణ తెలిపారు.

ఎస్‌ఐ కుటుంబసభ్యులకు హెల్త్ బాగోలేదంటూ..

కొత్త తరహా సైబర్ మోసాలు

గొల్లప్రోలు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు దిగుతున్నారు. ఎస్‌ఐ కుటుంబసభ్యులకు ఆరోగ్యం బాగోలేదు. డబ్బులు అత్యవసరం ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపండి అంటూ వారి నుంచి పలువురికి ఫోన్‌లు వస్తున్నాయి. కొందరు ఇది నిజమని నమ్మి వారికి డబ్బులు పంపుతున్నారు. ఇటువంటి సంఘటనలు ఇటీవల అధికం కావడంతో ఈ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని కాకినాడ జిల్లా గొల్లప్రోలు ఎస్‌ఐ ఎన్.రామకృష్ణ సూచించారు. ఈ కాల్స్‌ను నమ్మవద్దని, ఎటువంటి సొమ్ములు ట్రాన్స్‌ఫర్ చేయవద్దని తెలిపారు. ఇలాంటి కాల్స్ వస్తే వెంటనే సమీపంలో పోలీస్‌స్టేషన్లకు సమాచారం అందించాలని ఆయన కోరారు.


గోకవరంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులు


రంగంపేటలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు


వై.జంక్షన్ నుంచి గోకవరం బస్టాండు వరకూ జరిగిన ర్యాలీలో పాల్గొన్న ఎంపీ పురందేశ్వరి

మహనీయుడు అంబేడ్కర్

- ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి
- ఘనంగా రాజ్యాంగ నిర్మాత జయంతి
- పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారుల నివాళి
- కేకులు కట్ చేసి సంబరాలు
- వృద్ధులకు చీరలు, దుప్పట్ల పంపిణీ


బుర్రిలంక కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల

ధవళేశ్వరం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత పేద, బడుగు వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన మహనీయుడు భారత రత్న బీఆర్ అంబేడ్కర్ అని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజ్యాంగ నిర్మాత జయంతిని పలు చోట్ల సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పలువురు నాయకులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. సేవా కార్యక్రమాలు చేపట్టారు. ధవళేశ్వరంలో బస్టాండ్ సెంటర్ వద్ద బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే గోరంట్ల ముఖ్యఅతిథిగా విచ్చేసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉన్న అంటరానితనంపై పోరాడిన ధీరోదాత్తుడు అంబేడ్కర్ అని కొనియాడారు. ఆయన ఆశయాల సాధన దిశగా కూటమి ప్రభుత్వం పయనిస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు పండూరి అప్పారావు, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ బోర్డు డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, చందన నాగేశ్వర్, సీఐ టి.గణేష్, తలారి మూర్తి, యడ్ల మహేష్, తలారి ప్రసాద్ పాల్గొన్నారు. లాక్‌లైన్ సెంటర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మోర్త పావన మూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వైసీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. నక్కా రాజబాబు, ఇరిగేషన్ ఉద్యోగులు, దళిత నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక క్వారీ కెనాల్ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి విఘ్నేశ్వర ఆటో యూనియన్ నాయకుడు గాలి రాధాకృష్ణ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఆదిత్య నగర్‌లో బీజేపీ నాయకుడు వి.కుబేరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఒంటెద్దు స్వామి, పన్నాల వెంకటలక్ష్మి, షేక్ షాజిత్, డాక్టర్ జి.కొండలరావు, అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కాటన్‌పేటలో అంబేడ్కర్ విగ్రహానికి పలువురు దళిత నాయకులు నివాళులర్పించారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో సీఐ టి.గణేష్ ఆధ్వర్యంలో ఎస్ఐ హరిబాబు, కాంతికుమార్, సిబ్బంది అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. పంచాయతీ కార్యాలయంలో వద్ద కార్యదర్శి వెంకట్రావు ఆధ్వర్యంలో కూటమి నాయకులు అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం పంచాయతీ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు.

కోరుకొండ: మండలంలోని కోరుకొండ, గాదరాడ, నర్సాపురం, జంబుపట్నం, బూరుగుపూడి, శ్రీరంగపట్నం, కోటికేశరం, రాఘవాపురం తదితర గ్రామాల్లో బాబాసాహెబ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ భారత స్వాతంత్ర సమరయోధుడు, రాజ్యాంగ నిర్మాత, దళిత నాయకుడు బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలన్నారు. అంతకుముందు ఆయన కోరుకొండ బస్టాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలు గ్రామాల్లో చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో జనసేన కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు తనకాల నాగేశ్వరరావు, కంటే నాగ కేశవరావు, గాదరాడ సర్పంచ్ దూది కాం తారావు, పీట్గా కృష్ణ పాల్గొన్నారు. మండలంలోని కొత్త జంబుపట్నం వద్ద నూతనంగా నిర్మించిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ యువజన సంఘ సభ్యులు, మాజీ సర్పంచ్ ఈతకోట చినబాబు తదితరులు పాల్గొన్నారు.


ఫరిజల్లిపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల

కడియం: మండలంలోని వేమగిరి గట్టు వద్ద సిద్ధార్థ యువజన సంఘం జంగా వినోద్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ తిలక్‌కుమార్ విచ్చేసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ప్రపంచ మేధావి అని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెలుగుబంటి నాని, టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి నాని, చెల్లుబోయిన శ్రీనువాసరావు, జంగా వినోద్, జంగా శ్యామ్, నల్లా మోహనదాసు పాల్గొన్నారు. కడియం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో ఎంపీడీవో కె.రమేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. పోలీస్‌స్టేషన్ వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి సీఐ ఎ.వెంకటేశ్వరరావు, ఎస్ఐలు దుర్గాప్రసాద్, ధనలక్ష్మీప్రసన్న నివాళులర్పించారు. హెడ్ కానిస్టేబుళ్లు సురేష్‌బాబు, వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు. పొట్టిలంకలో జరిగి కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ బొజ్జా తారకం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా వెంకటరత్నంరాజు, కలిదిండి గోవిందు, బడుగు సత్తిబాబు, నక్కా చంటిబాబు పాల్గొన్నారు. జేగురుపాడులో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ యాదల స్టాలిన్, పాతూరి రాజేష్, నాగిరెడ్డి రామకృష్ణ, ఆకుల సుధాకర్ పాల్గొన్నారు. అలాగే వీరవరం, బుర్రిలంక, వెంకయ్యపేట గ్రామాల్లో జరిగిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ రూరల్ ఇన్‌చార్జి తాడాల కొండ్రాజు, పి.సత్యనారాయణరాజు, యాళ్ళ వీరభద్రరావు, కొత్తపల్లి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు. బుర్రిలంకలో జాతీయ రహదారి సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే గోరంట్ల నివాళులర్పించారు. కార్యక్రమంలో వారా రాము, వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, పాటంశెట్టి రాంజీ, జంగా వినోద్, పంతం గణపతి, బోడపాటి గోపి తదితరులు పాల్గొన్నారు.

రాజానగరం: మండలంలోని సూర్యారావుపేట, ఫరిజెల్లిపేటలోని అంబేడ్కర్ విగ్రహాలు, చిత్ర పటాలకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ సేవలను స్మరించుకుంటూ ప్రతిఒక్కరూ ఆయన అడుగు జాడల్లో పయనించాలన్నారు. రాజానగరం మార్కెట్లోని అంబేడ్కర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ ప్రచార కమిటీ ఛైర్మన్ డాక్టర్ వైపే వడయార్, కోఆర్డినేటర్ వై.శ్రీనివాస్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

దివాన్‌చెరువు: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి రిజిస్ట్రార్ జి.సుధాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంటరానివాడిగా ఆరంభమైన అంబేడ్కర్ అందరివాడిగా ఎదిగి ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందారన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రంగంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీడీవో సాయిబాబు పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతగా, స్వతంత్ర భారత తొలి న్యాయశాఖ మంత్రిగా, స్వాతంత్ర్యోద్యమ వీరుడిగా దేశానికి అంబేడ్కర్ అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాల వద్ద అంబేడ్కర్ చిత్రపటాలకు, దళిత వాడల్లోని విగ్రహాలకు కూటమి నాయకులు, అధికారులు, అంబేడ్కర్ యూత్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో పసల గగారిన్, పోతుల రత్నబాబు, పోతుల చెల్లయ్య, వారా అప్పన్న, గుర్రే బుల్లియ్య, ఏగి సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

గోకవరం: స్థానిక సంజీవయ్య నగర్‌లో ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు తోటేటి రాంప్రసాద్, కునుకూరి ఏసురత్నం, నాయకులు గరబారపు శ్రీనివాస్, వీరచంద్రం, లాజర్ పాల్గొన్నారు. విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక న్యూ అంబేడ్కర్ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి, బంగాలిపేటలోని అంబేడ్కర్ చిత్రపటానికి పాలభిషేకం చేసి, పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం స్థానిక దేవిచౌక్ వద్ద, వీర్లంకపల్లిలో అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమాల్లో బీజేపీ మండలాధ్యక్షుడు ఇనకోటి బాపన్నదొర, సత్తి వెంకటరెడ్డి, దాసరతి ధర్మరాజు, బత్తుల నానాజీ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడిలో ఎల్ఐసీ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి డివిజనల్ మేనేజర్ కె.సంధ్యారాణి ముఖ్య అతిథిగా విచ్చేసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎల్ఐసీ సంఘ నాయకులు సమ్మతం గన్నెయ్య, ప్రసాదరావు, సత్యనారాయణసాహూ, కిషోర్, భాస్కర్, సరస్వతి, సుజాత ఓబీసీ నాయకులు పాల్గొన్నారు. కాతేరు గ్రామం మల్లయ్యపేట సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమానికి రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శోభనాద్రి శాస్త్రి, కార్యదర్శి పెల్లూరి రమేష్, డీవీవీ త్రినాథ్, న్యాయవాది సాకా సురేష్, ఆచంట కళ్యాణ్, గుంటూరు ప్రశాంత్ కుమార్, ఎంపీడీవో నాతి బుజ్జి, మానుకొండ చిన్నవెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరంలోని 13వ వార్డు అంబేడ్కర్ నగర్, 46వ వార్డు రామదాసుపేటలలో నూతనంగా నెలకొల్పిన అంబేడ్కర్ విగ్రహాలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కారణంగానే ఈ రోజు మనం స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నామని, అన్ని కులాలు సఖ్యతగా జీవిస్తున్నామన్నారు. దళితులంటే కార్లు డ్రైవర్లు కాదూ కారు ఓనర్లనే ఆలోచనతో ముందుకు వెళ్తున్నామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు, చాపల చిన్నరాజు, మజ్జి రాంబాబు, రెడ్డి మణి, బుడ్డిగ రాధా, కప్పల వెలుగుకుమారి, బొర్రా చిన్ని, కవులూరి వెంకట్రావు, ద్వారా పార్వతి సుందరి, కోసూరి చండీప్రియ పాల్గొన్నారు. అలాగే 48వ డివిజన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ పూలమాలతో నివాళులర్పించారు. స్థానిక తాడితోటలోని ఎస్సీఎస్టీ,ఓబీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు ముఖ్యఅతిథిగా విచ్చేసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. అంబేడ్కర్ అంటరానితనం నిర్మూలనకు చేసిన కృషిని, రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలను వివ రించారు. కార్యక్రమంలో పలువురు సంఘ నా యకులు, న్యాయవాదులు పాల్గొన్నారు. స్థానిక మల్లికార్జున నగర్‌లో షెడ్యూల్డ్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సమతా యూత్ వ్యవస్థాపకుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మరుకుర్తి రవియాదవ్, వై.రాజారావు, బేతల రామారావు, డి.ఠాగూర్ ఆర్.ప్రసాద్ పాల్గొన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కంబాల చెరువు మెయిన్ బ్రాంచ్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళుల ర్పించారు. ఎస్‌బీఐ డీజీఎం ప్రమోద్ కె.మిశ్రా, ఎస్సీఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సతీష్, డీజీఎస్ కుంచే యశ్వంత్, ఆఫీసర్స్ అసోసియేషన్ సీఆర్ఎస్ శేషుకుమార్, స్టాఫ్ యూనియన్ నాయకుడు పాపారావు పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా పేబ్యాక్ టుది సొసైటీలో భాగంగా స్థానిక ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఎస్టీ బాలికల వసతి గృహానికి ఇన్వర్టర్‌ను, ఎస్సీ బాలుర వసతి గృహానికి 10 సీలింగ్ ఫ్యాన్లు అందించారు. ధవళేశ్వరం సోషల్ వెల్ఫేర్ బాలుర వసతి గృహానికి వాటర్ ఫ్రిడ్జ్‌ను అందించారు. రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉన్నతాధికారులు, రుడా అధికారులు, పబ్లిక్ హెల్త్, ఇంజనీరింగ్ విభాగ అధికారులు అంబేడ్కర్ విగ్రహం, చిత్రపటాలకు నివాళులర్పించారు. ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో ఎస్ఈ తిలక్‌కుమార్, ఈఈ నక్కపల్లి శామ్యూల్ తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. ఎన్జీవో హోంలో ఏపీ ఏఈవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వేణుమాధవరావు, నగర అధ్యక్షుడు సుబ్బారావునాయుడు, మహిళా సంఘం ఛైర్‌పర్సన్ సత్యవతి, ప్రవీణ్‌కుమార్, రాఘవరావు తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఏడీ వెంకట్రాజు, చాయదేవి, డీఐ బి.దిలీప్‌కుమార్, సూపరింటెండ్ రాజకుమారి తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వాసు

అనపర్తి: అనపర్తిలోని కెనాల్ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం, హాస్టల్ వీధి, పాత హరిజన పేట, రామవరం గ్రామంలో జరిగిన కార్యక్రమాలకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలతో నివాళులర్పించారు. ఈ కెనాల్ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత నాయకుడు నల్లా చిన్నారావు అధ్వర్యంలో ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం అమలుతో అనేక సంస్కరణలు అమలు జరుగుతున్నాయని, ఆయన దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో తమలంపూడి సుధాకరరెడ్డి, సత్తి దేవదానరెడ్డి, మల్లిడి కృష్ణారెడ్డి, గొలుగూరి భాస్కరరెడ్డి, ఒంటిమి సూర్యప్రకాష్, నూతిక బాబూరావు, నల్లా చిన్నారావు తదితరులు పాల్గొన్నారు. అనపర్తిలోని ఏరియా ఆసుపత్రిలో సూపరిండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి, గ్రామ పంచాయతీ వద్ద సర్పంచ్ వారా కుమారి అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.

రాజమహేంద్రవరం అర్బన్: రాజమహేంద్రవరం గోకవరం బస్టాండు వద్ద అంబేడ్కర్ కాంస్యవిగ్రహానికి పలువురు వైసీపీ నాయకులు, దళిత, బీసీ, ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులు, అంబేద్కర్‌వాదులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ తోపాటు మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, నక్కా శ్రీనగేష్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జయకర్, షరీఫ్, కోశాధికారి ఈవీఎస్ఆర్ ప్రసాద్, తదితరులు నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్ వర్మ, నగరశాఖ అధ్యక్షుడు విజయకుమార్, నగర నాయకులు రెహమాన్, శర్మ తదితరులు నివాళులర్పించారు. సీపీఎం పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి టి.అరుణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.పవన్, జిల్లా కమిటీ సభ్యులు పూర్ణిమరాజు, నాయకులు నివాళులర్పించారు. రాష్ట్ర దళిత మహిళ నాయకురాలు దోనిపాటి అనంతలక్ష్మి, మన్యాల దుర్గ, పెందుర్తి నాగమణి, కుమారి నివాళులర్పించారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని ఏఎస్ఎఫ్ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు తాడేపల్లి విజయకుమార్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. జాంపేట ఆజాద్‌చౌక్ సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహానికి రోటరీక్లబ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ చార్టర్ అధ్యక్షుడు తీగల రాజా నివాళులర్పించారు. ఐకాన్స్ ప్రెసిడెంట్ ఇమ్మణి వెంకట్ పాల్గొన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు అధ్యాపకురాలు కేఎం సౌందర్యవతి బీఆర్ అంబేడ్కర్ జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్నందుకు కళాశాల తరపున అభినందనలు తెలిపారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో జరిగిన జయంతి వేడుకల్లో డెమో సత్యకుమార్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


అనపర్తిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అంబేడ్కర్.. అందరికీ ఆదర్శం: ఎంపీ

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): భారతరత్న డాక్టర్ అంబేడ్కర్ నేటి తరంతో పాటు భవిష్యత్ తరాలకు ఆదర్శం, స్ఫూర్తి అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం రాజమహేంద్రవరం గోకవరం బస్టాండు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీ పురందేశ్వరి, జేసీ చిన్నరాముడు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఇతర ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జేసీ కేక్ కట్ చేశారు. దాతల సహకారంతో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ అంబేడ్కర్ రాజ్యాంగకర్తే కాదు, మంచి దార్శనికుడు అని కొనియాడారు. ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ దేశంలోని ప్రతి పౌరుడు స్వేచ్ఛగా జీవిస్తున్నారంటే రాజ్యాంగంలో ఆయన పొందుపరచిన అధికరణలే అని అన్నారు. ఎస్పీ కిషోర్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలు, ఆదర్శాలు ప్రతి ఒక్కరూ పాటించి ఉన్నతస్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. యువత రాజ్యాంగ స్ఫూర్తిని పాటించేవిధంగా అడుగులు వేయాలని అన్నారు. జేసీ చిన్నరాముడు మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి అని, ఎన్ని కష్టాలు వచ్చినా చదువును నిర్లక్ష్యం చేయకుండా ఉన్నతచదువులు చదవాలని అన్నారు. ఎమ్మెల్సీ సోము మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని అన్నారు. ముందుగా రాజమహేంద్రవరం వై.జంక్షన్ నుంచి గోకవరం బస్టాండు అంబేడ్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణనాయక్, కార్పొరేషన్ అదనపు కమిషనర్ వి.రామలింగేశ్వరరావు, ఏఎస్పీ మురళీకృష్ణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ కోమల, సాంఘిక సంక్షేమ అధికారిణి శోభారాణి, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నాయకులు, హాస్టళ్ల విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి: ఎస్పీ



రాజమహేంద్రవరం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరమని, ఆయన చూపిన బాట అనుసరణీయమని ఎస్పీ నరసింహకిషోర్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి ఎస్పీ ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి సిబ్బందికి పంచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థికవేత్త, రాజనీతిజ్ఞుడు, రాజ్యాంగ రూపశిల్పి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అలుపెరగని కృషి చేసిన సమసమాజ స్థాపకుడు అంబేడ్కర్ మహాశయుడని కొనియాడారు. అనంతరం హెడ్ కానిస్టేబుల్స్ జి.నాగభూషణం, శేఖర్‌ల సౌజన్యంతో నాలుగు వృద్ధాశ్రమాలు, అనాథ శరణాలయాల్లో అన్న వితరణ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎంబీఎన్ మురళీకృష్ణ(అడ్మిన్), ఏవీ సుబ్బరాజు(శాంతి భద్రతలు), ఎల్.అర్జున్(క్రైమ్స్), ఎల్.చెంచిరెడ్డి(ఏఆర్), డీఎస్పీలు బి.రామకృష్ణ (ఏఆర్), రవికుమమార్(ఏఆర్), త్రీటౌన్ సీఐ వి.అప్పారావు, ఆర్ఐ(అడ్మిన్) సంజీవ్‌కుమార్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఆర్.రఘురాం, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

అర్బన్, రూరల్ బీజేపీ కేడర్‌కు రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి దిశానిర్దేశం


సమావేశంలో మాట్లాడుతున్న పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయి నుంచి బీజేపీ సంస్థాగత నిర్మాణం, పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త సంసిద్ధులు కావాలని, రాబోయే రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా ప్రతి ఒక్కరూ పాల్గొనడం ద్వారా సత్తా చాటాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ నియోజకవర్గాల క్రియాశీలక సభ్యుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పురందేశ్వరి మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సబ్ కా సాత్, సబ్ కా వికాస్ నినాదాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని అన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, మాజీ అధ్యక్షుడు బొమ్ముల దత్తు, అర్బన్ అసెంబ్లీ కన్వీనర్ రంగబాబు, రూరల్ అసెంబ్లీ కన్వీనర్ ఆకుల శ్రీధర్, నాయకులు రొంగల గోపి, హారిక, లక్ష్మీ సంతోషి, కురగంటి సతీష్ పాల్గొన్నారు.

మహిళా పీఎస్ డీఎస్పీగా సత్యనారాయణ



రాజమహేంద్రవరం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా కేవీ సత్యనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు జిల్లాలో పనిచేసిన అనుభవం ఉంది. 1991 బ్యాచ్ ఎస్ఐగా విధుల్లో చేరిన ఆయన.. ఉమ్మడి తూర్పుగోదావరిలో సీఐ, ట్రాఫిక్, ఎస్బీ డీఎస్పీగా పని చేశారు. రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా మహిళల రక్షణే ధ్యేయంగా ప్రారంభించిన 'శక్తి' యాప్‌పై విస్తృతంగా అవగాహన కల్పిస్తామన్నారు. మహిళలు, బాలికలపై జరిగే నేరాపై దృష్టి పెడతామన్నారు. వారి ఫిర్యాదులపై వేగంగా స్పందించి తగిన చర్యలు తీసుకొని బాసటగా నిలబడతామని చెప్పారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): యువతను ఉపాధి, ఉద్యోగాలకు దూరం చేస్తున్న పాలకుల విధానాలకు వ్యతిరేకంగా మే నెలలో తిరుపతిలో నాలుగు రోజులపాటు జరిగే ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు అన్నారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల కరపత్రాల విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతను అన్ని రకాలుగా మోసం చేస్తున్న పాలకులపై ఉద్యమించడానికి ఈ మహాసభలు వేదికగా నిలుస్తాయని అన్నారు. మే 15-18 తేదీల్లో ఈ మహాసభలు జరుగుతాయని, వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, త్రిమూర్తులు, జిల్లా కార్యదర్శి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

అనపర్తిలో అగ్నిమాపక వారోత్సవాలు

అనపర్తి, ఏప్రియల్ 14 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలలో చిక్కుకున్న ప్రజలను కాపాడే క్రమంలో అసువులు బాసిన ఫైర్ అధికారులు చిరస్మరణీయులని వారి సేవలను ప్రతిఒక్కరూ గుర్తించుకోవాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం అనపర్తి ఫైర్ స్టేషన్లో అగ్నిమాపక వారోత్సవాలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం వారోత్సవాల సందర్భంగా ముద్రించిన కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం అగ్నిమాపక వాహనాన్ని జెండా ఊపి వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం అగ్నిప్రమాదాలను వేగంగా ఎదుర్కొనేందుకు ఆ శాఖ వినియోగిస్తున్న అత్యాధునిక పరికరాలను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, టీడీపీ నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, సత్తి దేవదానరెడ్డి, కర్రి శేషారత్నం, సుబాషిణి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త కుటుంబానికి టీడీపీ భరోసా

అనపర్తి, ఏప్రియల్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి కార్యకర్త కుటుంబానికి భరోసా కల్పించడమే టీడీపీ లక్ష్యమని నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎస్ఎస్ఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన సభ్యత్వ గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని కార్యకర్తలకు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తల రక్షణ కోసం ప్రమాద సమయంలో వారి కుటుంబానికి బాసటగా నిలిచే విధంగా రూ.5 లక్షల ప్రమాద బీమా అందించేందుకు పార్టీ కృషి చేసిందని అన్నారు. కార్యక్రమంలో తమలంపూడి సుధాకరరెడ్డి, జుత్తుగ కృష్ణ, సూర్యకుమారి, సానా శ్రీను పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో భారీ ఐక్యత ర్యాలీ


ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎస్ఈ తిలక్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని క్వారీ సెంటర్ నుంచి గోకవరం బస్టాండ్ సెంటర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ఆస్క్, ఎస్సీఎస్టీ మైనార్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారీ ఐక్యత ర్యాలీని నిర్వహించారు. సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ ర్యాలీని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కె.తిలక్‌కుమార్, డాక్టర్ కోమలి దంపతులు జెండా ఊపీ ప్రారంభించారు. అంబేడ్కర్ సేవా కేంద్రం (ఆస్క్) ఛైర్మన్ గుబ్బల రాంబాబు, ఉత్సవ ర్యాలీ కన్వీనర్ అజ్జరపు వాసు, ముస్లిం మైనార్టీ నాయకులు అన్సర్, అమిర్, బీసీ నాయకులు నయనాల కృష్ణారావు, మార్గాని చంటిబాబు, రేలంగి శేఖర్, రూపస్, అంబటి సత్యనారాయణ, జె.ప్రసాద్, ఈ.శ్రీనివాస్, తిరగట్టి దుర్గారావు, వినోద్, మధు, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విద్యాసాధన కోసం పోరాటం

జార్జిరెడ్డి వర్ధంతి సభలో పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్



కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న పీడీఎస్‌యూ

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : శాస్త్రీయ విద్యావిధానం కోసం పోరాడాల్సిన అవసరం ఉందని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలోని మహిళా కళాశాల సెంటర్లో పీడీఎస్‌యూ ఉద్యమ నిర్మాత జార్జిరెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తుల ర్యాలీ జరిపారు. ఈ కార్యక్రమంలో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ విద్య కాషాయీకరణను, కార్పొరేటీకరణను ప్రతిఘటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కె.భానుప్రసాద్, పట్టణకార్యదర్శి దినేష్‌బాబు, చంద్రశేఖర్, విష్ణు, మమత, అంజలి తదితరులు పాల్గొన్నారు.





రాజమహేంద్రవరంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు

అంబేడ్కర్‌కు ఘన నివాళి

- జిల్లా అంతటా జయంతి వేడుకలు
- ఊరూరా సంబరాలు.. విందులు
- హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

వేమగిరిలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్





రాజమహేంద్రవరంలో జేసీ, ఎస్పీ నివాళులు

మామిడి.. నేలబడి..



ఈదురుగాలుల బీభత్సానికి ధర్మవరంలో నేలరాలిన మామిడి





- రారాజు మామిడికి గడ్డురోజు
- ఉమ్మడి తూ.గో.జిల్లాలో అకాల వర్షాలతో తీవ్ర నష్టం
- తీవ్ర ఈదురుగాలులతో భారీగా రాలిపోయిన మామిడికాయలు
- ఈదురుగాలులకు 16 వేల ఎకరాల్లో నష్టం.. రైతులు లబోదిబో
- ఉమ్మడి జిల్లాలో 38,500 ఎకరాల్లో మామిడితోటలు.. ఒక్క కాకినాడ జిల్లాలోనే 18,400 ఎకరాల్లో సాగు
- ఉమ్మడి జిల్లా నుంచి ఏటా రెండు లక్షల మెట్రిక్ టన్నుల కాయల దిగుబడి

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

చూడగానే నోరూరించే మామిడి పండ్లు ఈ సీజన్‌లో కొనడం కష్టంగానే కనిపిస్తోంది.. అకాల వర్షాలు, వడగండ్లు... ఈదురుగాలులుతో కొన్నిరోజులుగా ఉమ్మడి జిల్లాలో మామిడికి తీవ్రంగా నష్టం వాటిల్లింది.. ఎక్కడికక్కడ చెట్ల నుంచి కాయలు భారీగా నేలరాలిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.. మరో రెండు వారాల్లో కాయలు పక్వానికి వచ్చే దశలో ఉండగా, అకాల వర్షాలు విరుచుకుపడడడంతో కాయలన్నీ ఎందుకు పనికిరాకుండా పోయిన పరిస్థితితో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈ ఏడాది మామిడి పూత ఆశాజనకంగా ఉండడంతో మంచి లాభాలు వస్తాయని రైతులు అంచనా వేసుకున్నారు. అటు వ్యాపారులు సైతం లక్షల్లో అడ్వాన్సులు ఇవ్వడంతో రైతులు పెట్టుబడి భారీగా పెట్టారు. తీరా అకాలవర్షాలు తీవ్రంగా దెబ్బతీశాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 19 వేల ఎకరాల్లో తోటల్లో నేలరాలిన కాయలకు ఇప్పుడు ధరలు కూడా రాకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. వాస్తవానికి ఉమ్మడి జిల్లాలో 38,500 ఎకరాల్లో మామిడి తోటలు సాగవుతుండగా, ఒక్క కాకినాడ జిల్లాలోనే 18,400 ఎకరాల్లో ఉన్నాయి. ఏటా రెండు లక్షల మెట్రిక్ టన్నుల కాయల దిగుబడి జరుగుతుండగా, ఈ దఫా సగానికి పైగా దిగుబడి పడిపోయే ప్రమాదం ఉంది.

మామిడీలా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈనెలలోనే పలుసార్లు అనేక మండలాల్లో తీవ్రంగా ఈదురుగాలులు, వడగండ్ల వర్షాలు కురిశాయి. దీంతో చెట్లకు ఉన్న యాభై శాతానికిపైగా కాయలు రాలిపోయాయి. కాస్తోకూస్తో మిగిలిన కాయల నాణ్యత సైతం దెబ్బతినడంతో పెట్టుబడులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. పక్వానికి ముందే రాలిపోయిన మామిడి మార్కెట్లకు వచ్చినా కొనేందుకు ప్రజలు ఆసక్తి చూపించడం లేదు. అటు తాండ్ర తయారీదారులు అతి తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. వాస్తవానికి ఈ ఏడాది మామిడి పూత నూరుశాతం వచ్చింది. కాయలు సైతం 70శాతానికిపైగా నిలబడ్డాయి. ఫలితంగా భారీగా మార్కెట్ ఉంటుందని రైతులు భావించారు. ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు వచ్చి కాయలు చూసి లక్షల్లో రైతులకు అడ్వాన్సులు ఇచ్చారు. దీంతో లాభాలొస్తాయన్న అంచనాలతో రైతులు సైతం పెట్టుబడులు భారీగా పెట్టారు. ప్రధానంగా ఈసారి బంగినపల్లి టన్ను రూ.60 వేలు, కొత్తపల్లి కొబ్బరి టన్ను రూ.90 వేలు, పందూరు మామిడి టన్ను రూ.65 వేల వరకు ధర వెళ్తుందని రైతులు భావించారు. వాస్తవానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 38,500 ఎకరాల్లో మామిడి తోటలు సాగవుతున్నాయి. ఇందులో అత్యధికంగా కాకినాడ జిల్లాలోనే 18,400 ఎకరాల్లో సాగవుతోంది. ఏటా ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల మెట్రిక్ టన్నుల వరకు మామిడి దిగుబడి అవుతుంది. ఇందులో 600 టన్నుల వరకు ఒక్క దక్షిణ కొరియాకే ఎగుమతి అవుతాయి. ఇందులో ఎక్కువగా కాకినాడ జిల్లా నుంచి అధిక ఎగుమతులు జరుగుతాయి. అత్యధిక సాగు కాకినాడ జిల్లాలోని ప్రత్తిపాడు మండలం, గొల్లప్రోలు, తుని, తొండంగి, కోటనందూరు, శంఖవరం, రౌతులపూడి, జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో తోటలున్నాయి. అటు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రామచంద్రపురం, మండపేట, ఆలమూరు తదితర ప్రాంతాల్లో వివిధ రకాల మామిడి తోటలున్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్, సీతానగరం తదితర మండలాల్లో రైతులు వందల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. అయితే తాజాగా కురిసిన అకాల వర్షాలు, ఈదురుగాలులతో ఉమ్మడి జిల్లాలో 16 వేల ఎకరాల్లో తోటలకు నష్టం వాటిల్లినట్టు అంచనా. అయితే మరో రెండు వారాల్లో చెట్ల నుంచి కాయలు దించడానికి అంతా సిద్ధం చేసుకుంటున్న తరుణంలో అకాల వర్షాలతో రైతుల ఆశలన్నీ ఆవిరయ్యాయి. ప్రధానంగా ఈవారంలో మూడుసార్లు కురిసిన భారీ వర్షాలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ముఖ్యంగా ఆదివారం రాత్రి వీచిన భారీ ఈదురుగాలులు, వడగండ్ల వానతో నష్టం మరింత పెరిగింది. పది రోజుల వ్యవధిలో కాయలు కోసి మార్కెట్‌కు పంపడం తరువాయి అనే దశలో వీచిన పెనుగాలుల ప్రభావంతో మామిడితోటల్లో కాయలన్నీ నేలరాలిపోయాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎక్కడ మామిడి తోటలు చూసినా రాలిపోయిన మామిడికాయలు గుట్టలు, గుట్టలుగా కనిపిస్తున్నాయి. సాధారణంగా ఏప్రిల్ చివరి వారం నుంచి మార్కెట్‌కు నాణ్యత కలిగిన మామిడి రాక ప్రారంభమవుతుంది. అంతకంటే ముందుగానే మామిడి వచ్చినా వాటి నాణ్యత అంతంతమాత్రంగానే ఉంటుంది. ఈ ఏడాది మామిడి మార్కెట్ ఆశాజనకంగా ఉండడం, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి ఆర్డర్లు ఉన్న నేపథ్యంలో తమ పంట పండుతుందని రైతులు ఆశించారు. అయితే ఈదురుగాలులకు ఎక్కడికక్కడ మామిడికాయలు రాలిపోవడంతో వారు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. మామిడితోటల్లో రాలిన మామిడిని ఏరి గుట్టలుగా పోయడంలో రైతులు నిమగ్నమయ్యారు. రాలిన మామిడికి ఏరివేత కూలి వస్తే అదే చాలని చెబుతున్నారు. మరోవైపు చెట్లకు మిగిలి ఉన్న మామిడి నాణ్యత సైతం దెబ్బతినే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నారు.

కాయరాలితే నష్టం చెల్లింపు నిల్

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మామిడి, జీడిమామిడి వంటి పండ్లకు సంబంధించి ఈదురుగాలుల వల్ల కాయలు రాలిపోతాయి. చెట్ల కొమ్మలు విరిగిపోతుంటాయి. కానీ ప్రభుత్వ నిబంధన ప్రకారం ఏకంగా చెట్లు నేల కూలి తేనే పరిహారం ఇస్తారు. ఎన్నికాయలు రాలిపోయినా, చెట్లు కొమ్మలు విరిగిపోయినా పరిహారం రాదు. నిజానికి లక్షల్లో కౌలు చెల్లించి మామిడి తోటలు రైతులు తీసుకుంటారు. కాయలు రాలిపోతే మొత్తం నష్టపోతారు.

రుడాకు మాస్టర్ ప్లాన్!



- 1094 చ.కి.మీతో డ్రాఫ్ట్ రెడీ
- మొత్తం 3,156 చ.కి.మీతో 27 మండలాలు, 392 గ్రామాలకు వర్తించే ప్రయత్నం
- టూరిజం విజన్ డాక్యుమెంట్‌తో రుడా పరిధిలో టూరిజం అభివృద్ధి
- 1354 ఎకరాల్లో అనధికార లేఅవుట్లు
- పంచాయతీ సెక్రటరీలకు నోటీసులు
- నెలాఖరులోపు లేఅవుట్లు రద్దు చేసుకుని, తిరిగి దరఖాస్తు చేయాలి
- రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ(రుడా) పరిధిలోని అన్ని ప్రాంతాలను అనుసంధానం చేస్తూ మాస్టర్‌ప్లాన్ రూపొందించనున్నామని రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి వెల్లడించారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడారు. గతంలో రాజమహేంద్రవరం, పరిసర గ్రామాల పరిధిలో 162 చ.కిలోమీటర్ల మేర మాస్టర్‌ప్లాన్ అమలులో ఉంది. కానీ గోదావరి అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ ఉన్నప్పుడు 1094 చదరపు కిలోమీటర్ల మేర మాస్టర్ ప్లాన్ ముసాయిదాను తయారుచేశారు. కానీ అప్పట్లో దానిని ప్రభుత్వ ఆమోదం కోసం పంపలేదు. ఇవాళ దానిని మరింత మెరుగుపరచనున్నాం. దీనికోసం అభ్యంతరాలు తెలియజేయవలసిందిగా ప్రజలను కోరుతున్నామని రమణచౌదరి చెప్పారు. అంతేకాక ప్రస్తుతం రుడా పరిధి బాగా పెరిగింది. తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని ప్రాంతాలతోపాటు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రామచంద్రపురం, కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గాలు, ఏలూరు జిల్లాలోని ద్వారకాతిరుమల మండలం కూడా కలిసింది. దీంతో మొత్తం 3,156 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో మాస్టర్‌ప్లాన్ రూపొందించవలసి ఉందన్నారు. ప్రస్తుతం 1094 చదరపు కిలోమీటర్లతో మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్ సిద్ధంగా ఉంది. దానికి మిగిలిన 2 వేల 61 చదరపు కిలోమీటర్లు కలిపి మాస్టర్‌ప్లాన్ కోసం ప్రయత్నాలు మొదలు పెట్టాం. ఇదంతా పూర్తయితే మొత్తం ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని స్పష్టంచేశారు. రుడా పరిధిలో ఏరియా డెవప్‌మెంట్ ప్లాన్‌ను అమలు చేయనున్నాం. దాని కోసం కసరత్తు చేస్తున్నాం. ఏదో ప్లాన్ వేసి వదిలేయడం కాకుండా స్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కనిపించేలా ఈ ప్లాన్ అమలు చేయనున్నాం. ఇండస్ట్రియల్ అభివృద్ధితోపాటు పర్యాటక రంగాన్ని ఉపాధి రంగంగా అభివృద్ధి చేయడానికి

ఇంటర్వ్యూ

టూరిజం విజన్ డాక్యుమెంట్ ద్వారా రుడా పరిధిలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. ఎక్కువ మందికి ఉద్యోగ ఉపాధికల్పనే లక్ష్యంగా ఈ ప్రాజెక్టు చేపడతాం. పీపీపీ విధానంలో రూపొందిస్తాం. రుడా పరిధిలో అఖండ గోదావరి ప్రాజెక్టు కింద ఇప్పటికే హేవలాక్, బ్రిడ్జిలంకకు నిధులు మంజూరయ్యాయి. మరో 16 ఐలాండ్‌లు, లేక్‌లు కూడా గుర్తించామని చెప్పారు. పిచ్చుకలంక, ఆత్రేయపురం లంకలు, అఖండగోదావరి లంకలు, పోలవరం ప్రాజెక్టు దిగువన సీతానగరం, కోరుకొండ మండలాల పరిదిలోని కొండలు కూడా పర్యాటకంగా అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. పురుషోత్తపట్నం ఆవను పర్యాటకంగా అభివృద్ధి చేయనున్నామన్నారు. వీటికి డీపీఆర్ తయారుచేయడానికి కన్సల్టెన్సీ ఎంపిక కోసం టెండర్లు పిలవనున్నట్టు చెప్పారు. రిసార్ట్స్, హోటళ్లు కూడా అభివృద్ధి చేస్తాం. రుడా ఆధ్వర్యంలో వాటిని ప్రమోట్ చేసి, ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్వహించనున్నట్టు వివరించారు. గతంలో రుడా నిధులతో నిర్మించిన రుడా పార్కులు, ఓపెన్ జిమ్‌లకు నిర్వహణ లోపం ఉంది. కేవలం ఒక్కొక్కటి రూ.25 లక్షల కంటే ఎక్కువ నిధులతో వీటిని నిర్మించినప్పటికీ నిర్వహణ లేదు. పీఈటీలు, ప్రైవేట్ వ్యక్తుల నిర్వహణకు ఇస్తే ఎలా ఉంటుందనే ఆలోచన చేస్తున్నామన్నారు. రుడా పరిధిలో 1800 ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, బీపీఎస్ కింద 200 దరఖాస్తులు ఉన్నాయన్నారు. సిబ్బంది అధికంగా అవసరం అవుతున్నారని, ఇప్పటికే మేళా నిర్వహించినా కూడా కొంతవరకూ మాత్రమే పరిష్కరించినట్టు చెప్పారు. ఒక భవనం కోసం వచ్చిన దరఖాస్తును పరిశీలించాలన్నా, మొత్తం లేఅవుట్‌ను పరిశీలిస్తేనే గానీ, సమస్య తేలడం లేదని తెలియజేశారు.

ల్యాండ్ పూలింగ్‌తో లేఅవుట్లు

ప్రజల నుంచి ల్యాండ్ పూలింగ్ చేసి రుడా లేఅవుట్లు అభివృద్ధి చేసే ప్రయత్నం చేస్తున్నాం. మా వైస్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్, రుడా అధికార్లతో ఇప్పటికే చర్చించాం. దీనివల్ల అన్ని మౌలిక సదుపాయాలతో లేఅవుట్లు వస్తాయి. రుడా పరిధిలోని అనధికార లేఅవుట్‌లకు ఇప్పటికే నోటీసులు ఇచ్చాం. అక్కడ ఏవిధమైన నిర్మాణాలు చేపట్టకూడదని కూడా స్పష్టం చేశాం.

మున్సిపాల్టీలు.. పంచాయతీల్లో రుడా షాపింగ్ కాంప్లెక్స్‌లు

మున్సిపాల్టీలు, పంచాయతీలు స్థలాలు చూపిస్తే రుడా నిధులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించడానికి నిర్ణయం తీసుకున్నాం. ఇప్పటికే కొవ్వూరు, రామచంద్రపురం మున్సిపాల్టీల నుంచి, వెస్ట్ గోనగూడెం నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. వీటిని నిర్మించిన తర్వాత వచ్చే ఆదాయం ఆయా సంస్థలతోపాటు రుడాకు కూడా లభించేలా చేస్తున్నాం.

బ్యారేజీ వద్ద పర్యవేక్షణ లోపం

మద్దూరులంక ప్రాంతంలో గాలింపు చర్యలు



అడ్డగట్ల వద్ద వేలాది మంది స్నానాలు.. ప్రాణాలు కోల్పోతున్న యువకులు


(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

బ్యారేజీ వద్ద అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నిషేధిత స్థలాల్లో స్నానాలకు వెళ్లి అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రతీ ఏటా విషాద ఘటనలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. వేసవి కావడంతో సరదా కోసం అనేక మంది బ్యారేజీ దిగువ ప్రాంతంలోనూ, లాకుల వద్ద స్నానాలు చేస్తున్నారు. ఏకంగా మోటారు సైకిళ్ల వంటి వాహనాలను కూడా తీసుకెళ్లి షీట్లు చేస్తున్నారు. యువతతోపాటు మహిళలు, పెద్దలు, చిన్నపిల్లలు కూడా ఇక్కడ స్నానాలకు ఎగబడడం గమనార్హం. నిజానికి ఇవన్నీ నిషేధిత ప్రాంతాలు. ఇక్కడెవరూ స్నానం కూడా చేయకూడదు. కానీ అధికారులు పట్టించుకోకపోవడం వల్ల ఎండాకాలంలో ఇక్కడ జనం జలకాలాటలు ఎక్కువ అవుతున్నాయి. ధవళేశ్వరం నుంచి విజ్జేశ్వరం వరకూ గోదావరి కాటన్ బ్యారేజీకి 175 గేట్లు ఉన్నాయి. వీటి దిగువ కొంత నీరు ఉంటుంది. ఊట నీరు కూడా ప్రవహిస్తూ ఉంటుంది. గేట్ల వద్ద అఖండ గోదావరి వైపు ఎక్కువ నీరు ఉంటుంది. ఇది ప్రమాదకరమైన ప్రాంతం. అక్కడ కొందరు దూకి సాహసాలు చేస్తుంటారు. ఇక్కడ ఎక్కడ ఊబి ఉందో, ఎక్కడ గొయ్యి ఉందో తెలియదు. దీంతో నూరేళ్లు బతకవలసిన పిల్లలు వాటిలో పడి అకాల మృత్యువుకు గురవుతున్నారు. వారి కన్నవారికి శోకం మిగులుతోంది. ఇప్పటికైనా అధికారులు పర్యవేక్షణ పెంచే చర్యలు తీసుకోవాలి.

గోదావరిలో స్నానానికి దిగి
ఇద్దరు యువకుల గల్లంతు 8

నరసన్న కొండకు త్వరలో రోప్‌వే!

కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్.. ఫలించిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కృషి



కోరుకొండ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఎత్తైన కొండపైకి భక్తులు వెళ్లేందుకు రోప్‌వే ఏర్పాటుచేయాలన్న ఎన్నో ఏళ్ల ప్రతిపాదనకు ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ చేసిన ప్రయత్నాలు ఫలించడంతో ఈ ప్రాజెక్టుకు మోక్షం లభించింది. ఆంధ్రప్రదేశ్‌లో 5 పర్యాటక ప్రాంతాల్లో రోప్‌వేలు నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి తాజాగా సమాచారం అందింది. ఆంధ్రప్రదేశ్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఏపీ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలోనే ఏపీ పర్యాటక రంగం అభివృద్ధికి ఊతమిచ్చేలా కీలక అడుగుపడింది. ఆంధ్రప్రదేశ్‌లో ఐదుచోట్ల రోప్‌వే ప్రాజెక్టుల నిర్మాణానికి కసరత్తు జరుగుతోంది. ఇందులో భాగంగా సమగ్ర ప్రాజెక్టుల తయారీ నివేదికలో కన్సల్టెన్సీ సర్వీసుల కోసం టెండర్లు ఆహ్వానించారు. ఈమేరకు నేషనల్ హైవే ఆంధ్రప్రదేశ్‌లో రోప్‌వే ప్రాజెక్టుల తయారీకి డీపీఆర్ తయారీ కోసం టెండర్లను ఆహ్వానించింది. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన 5 రోప్‌వేల్లో ఒకటి చిత్తూరు జిల్లాలోని బోయికొండపై గంగమ్మ ఆలయం, కర్నూలు జిల్లాలోని అహోబిలం దేవస్థానం, పల్నాడులోని కోటప్పకొండ, విజయవాడలోని భవానీ ద్వీపం, తూర్పుగోదావరిలోని కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి కొండకు అనుమతి లభించింది. ప్రధానంగా రుకొండ లక్ష్మీనరసింహస్వామి కొండకు 0.25 కిలోమీటర్ల మేర రోప్‌వేను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లోని 25 పర్యాటక ప్రాంతాల్లో రోప్‌వేల నిర్మాణం కోసం ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ప్రణాళికలను రూపొందిస్తోంది. దీనివల్ల రాష్ట్రంలోని పర్యాటకులతోపాటు ఇతర రాష్ట్రాల్లోని పర్యాటకులను ఆకర్షించేలా ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేస్తారు.

'అన్ని ఆసుపత్రుల్లో
అందుబాటులో
ఆరోగ్యశ్రీ సేవలు'
వైద్య ఆరోగ్యశాఖ
మంత్రి సత్యకుమార్ 8

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం



కొవ్వూరు టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, ఇతర నాయకులు

అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

● జయంతి సభల్లో కొనియాడిన పలువురు నేతలు
● వాడవాడలా ఘనంగా అంబేడ్కర్ 134వ జయంతి

కొవ్వూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణారావు అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ 134వ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు పెనుమాక జయరాజు, పట్టణ అధ్యక్షులు దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, వట్టికూటి వెంకటేశ్వరరావు, యనమదల సుబ్రహ్మణ్యం, వేమగిరి వెంకట్రావు,గెల్లా సురేష్, ఎం.చక్రపాణి, బొబ్బిలి పేర్రాజు, ఎం. బహదూర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే కాపవరంలో ఎంపీ పురందేశ్వరి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మెరకవీధి 4వ వార్డులో ప్రజాస్వామ్యవాది బొంతా శ్యాం రవిప్రకాష్, అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి పాల్గొన్నారు. వేములూరు, దొరయ్య చెర్వు, పట్టణంలోని బ్రిడ్జి పేటలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం. సుందరబాబు ఆధ్వర్యంలో, ఏఎంసీ కార్యాలయం వద్ద ఔట్ సోర్సింగ్ జేఏసీ చైర్మన్ నక్కా వెంకటరత్నం ఆధ్వర్యంలో, బస్టాండ్ సెంటర్, శ్రీనివాసపురం, రాజీవ్‌కాలనీ, మెరకవీధిలలో పౌర హక్కుల సంఘం, పీవోడబ్ల్యు, పీడీఎస్‌యు, ఐఎఫ్‌టీయూ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. అంబేడ్కర్‌ను మనమంతా ఆదర్శంగా తీసుకోవాలని గోపాలపురం మాజీఎమ్మెల్యే, నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు అన్నారు. సోమవారం 134 జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

నిడదవోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహనీయుడని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ కొనియాడారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, సంత మార్కెట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద, పురుషోత్తపల్లిలోని పలుచోట్ల ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ తోట కృష్ణవేణి, డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, పెన్మత్స చందు, కౌన్సెలర్లు పువ్వల రతీదేవి, తదితరులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ కార్యాలయంలో అం బేడ్కర్ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే బూరు గుపల్లి శేషారావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ, బైపే రాజేశ్వరరావు, మండలం కార్యదర్శి పంచదార దుర్గాప్రసాద్ , తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలను స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు కావూరి నాగేశ్వరరావు, సంజీవరావు, ఇబ్రహీం, విజయ, సుజాత, సాయి సిబ్బంది పాల్గొన్నారు. అలాగే తాళ్లపూడి మెయిన్‌రోడ్డులో గల అంబేడ్కర్ విగ్రహం వద్ద స్థానిక జైభీమ యూత్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ మంగన్న, ఇండియన్ నేవీ ఆఫీసర్ గూడా వికాస్, టీడీపీ మండలాధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, గూడా విజయరాజు, ఉడతా వీరేంద్ర, ఈరెల్లి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. వేగేశ్వరపురంలో జరిగిన జయంతి వేడుకల్లో జిల్లా అడిషనల్ ఎస్పీ అల్లూరి సుబ్బరాజు పాల్గొన్నారు. కార్యక్ర మంలో కొవ్వూరు సీఐ విజయబాబు, తాళ్లపూడి ఎస్‌ఐ రామకృష్ణ, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొ న్నారు. అన్నదేవరపేటలో యువగళం సభ్యుడు కాకర్ల సత్యేంద్ర ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రప టానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కూజిపూడి గణేష్, తొండెపు భరత్‌కుమార్ పాల్గొన్నారు.

పెరవలి: బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా మండలంలోని పలుగ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పెరవలిలో జరిగిన కార్యక్రమంలో గుమ్మాపు చిత్రసేను, సిర్రా రాజు, చల్లాబత్తుల సత్య నారాయణ, కప్పల ఇస్రాయేల్, చిరంజీవి, బద్దా ప్రసాద్, సత్తిరాజు పాల్గొన్నారు. అలాగే కానూరు, నడిపల్లి, తీపర్రు, కాకరపర్రు, ముక్కామల, ఖండవల్లిలో కార్యక్రమాలు జరిగాయి.



పెరవలిలో నివాళి అర్పిస్తున్న బీఎస్పీ నాయకులు



తాళ్లపూడి తహశీల్దార్ కార్యాలయంలో ...



నిడదవోలు : పురుషోత్తపల్లిలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్, ఇతరులు

నల్లజర్ల: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు, జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు అన్నారు. అంబేడ్కర్ జయంతిని మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ముందుగా దూబచర్ల గాంధీ కాలనీలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అలాగే దూబచర్ల సెంటర్, నల్లజర్లలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, పసుమర్తి రతీష్, టీడీపీ ఉపాధ్యక్షుడు గుదె సుబ్బారావు, చెల్లు పెద్దరామన్న, కొరపాటి వెంకటరత్నం, గంగరాజు, కూసంపూడి వెంకటేశ్వరరావు, చెల్లు సుబ్రహ్మణ్యం, గుళ్లపూడి వెంకటరత్నం, పెనుమాక వెంకటరత్నం పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు మండలంలో వాడవాడలా సోమవారం ఘనంగా నిర్వహించారు. వేలివెన్నులో అంబేడ్కర్ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక నేతలు, ఏసీ యూనియన్ నేతలు పాల్గొన్నారు. అలాగే ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ యల్లారీశ్వరి, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ప్రసాద్ పూలమాల వేశారు.

గోపాలపురం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134 జయంతి వేడుకలు గ్రామగ్రామాన సోమవారం ఘనంగా జరుపుకున్నారు. అందులో భాగంగా ఉప్పరగూడెంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కూనపోము ప్రసాదబాబు, గెల్లా శ్రీను, కొడవటి గంగరాజు, మల్లిపూడి సుబ్బారావు పాల్గొన్నారు.

చాగల్లు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని మండలంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి బహుజన రచయితల వేదిక, బీఎస్పీ నేతలు, అంబేడ్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆయనకు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కవి నేలపూరి రత్నాజీ, నాయకులు బయ్యే మునీంద్ర, నాగరాజు, వారా రాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. నవోదయ యంగ్‌మెన్ అసోసియేషన్ యూత్ సభ్యులు ఆధ్వర్యంలో స్థానిక రేడియో రూమ్ వద్ద అంబేడ్కర్ జయంతిని నిర్వహించి నివాళి అర్పించారు. నెలటూరులోనూ జయంతిని నిర్వహించారు.

దేవరపల్లి: అంబేడ్కర్ మహోన్నత వ్యక్తి అని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. యర్నగూడెం, దేవరపల్లి, చిన్నాయిగూడెం, యాదవోలు గ్రామాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేవరపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి గోపాలపురం నియోకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి సువర్ణరాజు, కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ కేవీకే దుర్గారావు, అధికారులు అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి అంబేడ్కర్ ఎంతో కృషిచేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్ పాల్గొన్నారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు మాట్లాడుతూ అంబేడ్కర్ అడుగుజాడలో మనమంతా పయనించాలన్నారు. టీడీపీ జనసేన నాయకులు అంద్రూ అనీల్, గన్నమని హరికృష్ణ, ముమ్మిడి సత్యనారాయణ, పెనుమత్స సుబ్బరాజు, ముళ్లపూడి దొరాజీ, గద్దే శ్రీనివాస్, ఉప్పులూరి రాంబాబు, మాధవరపు వెంకటేశ్వరరావు, కంబాల సత్తిబాబు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి : ఎంపీ



మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి

కొవ్వూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని ఆ పార్టీ నేత, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. సోమవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బీజేపీ క్రియాశీలక కార్యకర్తల నియోజకవర్గ స్థాయి సమావేశం జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు, మాట్ల ఆంజనేయులు, పిల్లలమర్రి మురళీకృష్ణ, నీరుకొండ సూర్యనారాయణ, గెల్లా కేశవ, పెరుగు పోతురాజు, డేగల సునీత, గండ్రోతు పవన్ పాల్గొన్నారు.

కూలింగ్ చలివేంద్రం ఏర్పాటు



నల్లజర్లలో ప్రారంభిస్తున్న సీఐ రాంబాబు

నల్లజర్ల, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): నల్లజర్ల అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం కూలింగ్ చలివేంద్రాన్ని సీఐ రాంబాబు, ఎస్ఐ రమేష్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ యూత్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొందల శ్రీనివాసరావు మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని దీన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లి జ్యోతి, సుబ్బారావు, గుదే రాంబాబు, గుదే సుబ్బారావు, గుదే శ్రీను, నాని, రాంబాబు, బాబీ, వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థికి మంత్రి దుర్గేష్ అభినందనలు

నిడదవోలు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సమిశ్ర గూడెంలోని వికాస్ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండోసంవత్సరం చదివిన విద్యార్థి శ్రీరామ్ స్వరూప్ ఇటీవల విడుదలైన ఫలితాల్లో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు (1000/992) సాధించాడు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ విద్యార్థిని సోమవారం శాలువాను కప్పి సత్కరించారు.

పెరవలి పంచాయతీరాజ్ యూనిట్ ఏకగ్రీవ ఎన్నిక

ఉండ్రాజవరం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం (పెరవలి యూనిట్ కార్యవర్గం) ఎన్నిక సోమవారం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా ఉండ్రాజవరం ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగి కె. ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షురాలిగా ఎం.విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా వీ. సురేంద్రనాథ్, సంయుక్తకార్యదర్శిగా జి. వెంకటేశ్వరరావు, కోశాధికారిగా ఐ. శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిలర్లుగా పి. సురేష్,టి. శ్రీనివాసరావు ఎన్నికయ్యారు.

అగ్నిమాపక శాఖ సేవలు కీలకం






నిడదవోలులో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్ , కొవ్వూరులో వారోత్సవాలను ప్రారంభిస్తున్న తహశీల్దార్

నిడదవోలు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాల సమయంలో అగ్నిమాపక శాఖ సేవలు కీలకమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం నిడదవోలు పట్టణంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయంలో అగ్నిమాపక శాఖ వారోత్సవాలలో భాగంగా కరపత్రాన్ని ఆవిష్కరించారు. మొదటిరోజు వారోత్సవాల్లో భాగంగా అగ్నిప్రమాదల్లో మరణించిన అమర వీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ నివాళి అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, జిల్లా సహాయ అగ్నిమాపక శాఖ అధికారి కె.శ్రీనివాసరావు, అగ్నిమాపక శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు: అగ్నిప్రమాదాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కొవ్వూరు తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్ అన్నారు. కొవ్వూరు అగ్నిమాపక శాఖ కార్యాలయంలో సోమవారం ఫైర్ అధికారి ఏవీ ఎస్ఎన్ఎస్ వేణు ఆధ్వర్యంలో తహశీల్దార్ పాల్గొని జెండా ఊపి పారంభించారు. ఫైర్ అధికారి ఏవీఎస్ఎన్ఎస్ వేణు మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 20 వరకు వారం రోజులపాటు అగ్ని సురక్షిత భారతదేశానికి ఐక్యమవ్వండి అనే నినాదంతో వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆంధ్రా సుగర్స్ మేనే జర్ ఈవీ కృష్ణారావు, సేఫ్టీ అధికారి కేవీవీ సత్యనారాయణమూర్తి, సగ్గొండ పరమేసు బయోటెక్ సేఫ్టీ అధికారి యు.రవీంద్ర, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆంధ్రాసుగర్ ఫ్యాక్టరీ మేనేజర్ ఈవీ కృష్ణారావు అన్నారు. పట్టణంలోని ఆంధ్రాసుగర్స్‌లో అగ్నిమాపక వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. హెచ్‌ఆర్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సీహెచ్ శుకమహర్షి మాట్లాడారు. కార్యక్రమంలో మెకానికల్ ఇంజనీర్ కె. శివాజీ, ఎలక్ట్రికల్ ఇంజనీర్ జె. రఘు, జేఈ నాగభూషణం, సేఫ్టీ ఆఫీసర్ ఎస్. సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే




పెద్దగూడెంలో కల్యాణ మండపానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధే కూటమి ప్రభుత్వ సంకల్పమని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. నియోజకవర్గ ముఖ్య కేంద్రమైన గోపాలపురంలోని పెద్దగూడెంలో అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రూ.50లక్షలతో నూతనంగా నిర్మించ తలపెట్టిన కల్యాణ మండపానికి సోమవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, గ్రామకమిటీ అధ్యక్షుడు జేష్ట శ్రీధర్, టీడీపీ మండల ఎస్సీ సెల్ కార్యదర్శి దాసరి రవి, నవచైతన్య అంబేడ్కర్ యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్.. అందరికీ ఆదర్శం : ఎంపీ

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): భారతరత్న డాక్టర్ అంబేడ్కర్ నేటి తరంతో పాటు భవిష్యత్ తరాలకు ఆదర్శం, స్ఫూర్తి అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం రాజమహేంద్రవరం గోకవరం బస్టాండు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీ పురందేశ్వరి, జేసీ చిన్నరాముడు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఇతర ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జేసీ కేక్ కట్ చేశారు. దాతల సహకారంతో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ అంబేడ్కర్ రాజ్యాంగకర్తే కాదు, మంచి దార్శనికుడు అని కొనియాడారు. ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ దేశంలోని ప్రతి పౌరుడు స్వేచ్ఛగా జీవిస్తున్నారంటే రాజ్యాంగంలో ఆయన పొందుపరచిన అధికరణలే అని అన్నారు. ఎస్పీ కిషోర్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలు, ఆదర్శాలు ప్రతి ఒక్కరూ పాటించి ఉన్నతస్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. యువత రాజ్యాంగ స్ఫూర్తిని పాటించేవిధంగా అడుగులు వేయాలని అన్నారు. జేసీ చిన్నరాముడు మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి అని, ఎన్ని కష్టాలు వచ్చినా చదువును నిర్లక్ష్యం చేయకుండా ఉన్నతచదువులు చదవాలని అన్నారు. ఎమ్మెల్సీ సోము మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని అన్నారు. ముందుగా రాజమహేంద్రవరం వై.జంక్షన్ నుంచి గోకవరం బస్టాండు అంబేడ్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణనాయక్, కార్పొరేషన్ అదనపు కమిషనర్ వి.రామలింగేశ్వరరావు, ఏఎస్పీ మురళీకృష్ణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ కోమల, సాంఘిక సంక్షేమ అధికారిణి శోభారాణి, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నాయకులు, హాస్టళ్ల విద్యార్థులు పాల్గొన్నారు.

50 మంది యువకుల రక్తదానం



గోపాలపురం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేసి మరొకరికి ప్రాణదానం చేయాలని బీజేపీ అధికార ప్రతినిధి గెల్లా శ్రీనుబాబు అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మంది యువకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేసినట్టు ఆయన తెలిపారు.

'అన్ని ఆసుపత్రుల్లో అందుబాటులో ఆరోగ్యశ్రీ సేవలు'



మంత్రికి ఆసుపత్రి వివరాలు తెలియజేస్తున్న రాధ

కొవ్వూరు, ఏప్రిల్ 14(ఆంధ్ర జ్యోతి): ఆరోగ్యశ్రీ సేవలు అన్ని ఆసుపత్రులలో అందుబాటులో ఉన్నాయని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. సోమవారం కొవ్వూరు పరిమి రామారాయుడు రత్తమ్మ కల్యాణ మండపంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోడూరి లక్ష్మీనారాయణ కుమారుడు వివాహ రిసెప్షన్‌కు మంత్రి, ఎంపీ పురందేశ్వరి, మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎస్. రాజీవ్‌కృష్ణలు హాజరయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరిమి రాధ నివాసానికి విచ్చేసిన మంత్రికి కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రి లేక ఏరియా ఆసుపత్రిగా మార్పు చేసి మెరుగైన వైద్యసేవలు అందించాలని పరిమి రాధ, జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర వినతిపత్రం అందజేశారు. అలాగే రాజమహేంద్రవరంలో జిల్లా ఆసుపత్రిని వైద్య కళాశాలగా మార్చారని, కొవ్వూరు ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా స్థాయిని పెంచాలన్నారు. ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ కొవ్వూరు నియోజకవర్గంలో దాతల సహకారం బాగుందని, ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. మంత్రి మాట్లాడుతూ ఆసుపత్రి స్థాయి పెంచినా వైద్యుల భర్తీ కష్టసాధ్యంగా మారిందన్నారు. ఆసుపత్రికి సంబంధించి పూర్తి వివరాలను పంపించాలని సూచించారు. పీ4 విధానంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కొవ్వూరులో ఏర్పాటుకు ఆసక్తి కలిగిన దాతలు ఉన్నట్టయితే తెలియజేయాలన్నారు. ప్రభుత్వం తరపున సహకారం అందిస్తామన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయం

కొవ్వూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి దాతలు ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. కొవ్వూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కొవ్వూరు, దొమ్మేరు రాష్ట్ర రహదారిలో డొక్కా సీతమ్మ చలివేంద్రాన్ని సోమవారం ఏర్పాటుచేశారు. మున్సిపల్ కమిషనర్ టీ. నాగేంద్రకుమార్ హాజరై మజ్జిగ పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి సత్యనారాయణ కమిషనర్ నాగేంద్రకుమార్‌ను శాలువా కప్పి సత్కరించారు. పాలెంపాటి చిన్నబాబు, ఆర్య వైశ్యసంఘం అధ్యక్షుడు మట్టేప్రసాద్, లయన్స్ క్లబ్ సభ్యులు కంటమణి రామకిషోర్, కలగర ఏడుకొండలు, పెనుమాక జయరాజు, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, పాలకోడేటి సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

గోదావరిలో ఇద్దరు యువకుల గల్లంతు

● నిడదవోలులో విషాదం ● ప్రమాదస్థలిని పరిశీలించిన మంత్రి దుర్గేష్



ప్రకాష్‌కుమార్, హర్ష (ఫైల్‌ఫొటోలు)



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి

కొవ్వూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మద్దూరులంక గ్రామంలోని చిగురులంక వద్ద గోదావరి నదిలో స్నానానికి దిగి ఇద్దరు యువకులు గల్లంతయిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. సోమవారం మధ్యాహ్నం సమయంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న ముగ్గురు యువకులు నిడదవోలు చర్చిపేట నుంచి రత్నదీప్, మత్తి ప్రకాష్‌కుమార్ (15), రాజమహేంద్రవరంకు చెందిన గంధం హర్ష (18)లు గోదావరి స్నానానికి కొవ్వూరు మండలం మద్దూరులంక వద్ద బ్యారేజ్ దిగువన స్నానానికి దిగారు. నదీ లోతుగా ఉండడంతో ప్రమాదవశాత్తు మునిగిపోతుండగా అక్కడే ఉన్న నిడదవోలుకు చెందిన మరో ఆరుగురు యువకులు ఉన్నారు. వారిలో దివాకర్ అనే యువకుడు మునిగిపోతున్న రత్నదీప్‌ను రక్షించారు. మిగిలిన ఇద్దరు గల్లంతయ్యారు. సమాచారం తెలుసుకున్న పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఆర్డీవో డా. రాణి సుస్మిత, డీఎస్పీ జి. దేవకుమార్, తహసిల్దార్ ఎం. దుర్గాప్రసాద్, రూరల్ ఎస్ఐ కె. శ్రీహరిరావులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానిక జాలర్లు, ఫైర్ సిబ్బందితో గోదావరి నదిలో అర్ధరాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఎంతో భవిష్యత్ ఉన్న యువకులు ప్రమాదవశాత్తు నదిలో గల్లంతవ్వడం బాధాకరమన్నారు. తల్లితండ్రులను చూస్తుంటే గుండె తరుక్కు పోతుందన్నారు. గల్లంతయిన యువకుల మృతదేహాలను వెలికి తీయడానికి కాకినాడ నుంచి ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను, గజ ఈతగాళ్ళను రప్పిస్తున్నామన్నారు. సంఘటనా స్థలం అంతా యువకుల తల్లితండ్రులు, బంధువుల రోదనలతో నిండిపోయిందన్నారు.

నిడదవోలు: నిడదవోలులోని చర్చిపేటలో అలముకున్న విషాదంలో ఒకరు మత్తి ప్రకాష్ కుమార్ (15) పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ఇటీవలే రాశాడు. సోమవారం అంబేద్కర్ జయంత్యుత్సవాల అనంతరం స్నేహితులతో కలిసి మద్దూరులంకలో గోదావరి స్నానానికి వెళ్లి గల్లంతయ్యాడు. తల్లి ఉపాధి నిమిత్తం కువైట్ వెళ్లగా, తండ్రి ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ప్రకాష్ గల్లంతు సమాచారంతో చర్చిపేటలో విషాదం అలముకుంది.

భారీ అన్నసమారాధన



బ్రాహ్మణగూడెంలో నిర్వహిస్తున్న దృశ్యం

చాగల్లు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఊనగట్ల కోదండ రామాలయం వద్ద సోమవారం భారీ అన్న సమారాధన జరిగింది. పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. బ్రాహ్మణగూడెంలోని రామాలయంలోనూ వేడుకల ముగింపు సందర్భంగా అన్నసమారాధన నిర్వహించారు. రామాలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అన్నసమారాధనకు ఎస్. ముప్పవరం, దారవరం, గరప్పాడు పరిసర గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి ప్రసాదాన్ని స్వీకరించారు.

ఇద్దరిపై కేసు నమోదు

కొవ్వూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తిని కొట్టి గాయపర్చిన కేసులో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఎం. సత్యనారాయణ తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... దొమ్మేరు సావరంలో మట్టే విశ్వనాథం ఇంటిముందు ఇసుక గుట్ట వేశాడు. దీంతో దారిలో అడ్డంగా ఉందని, అందరూ జారిపడుతున్నారని అదే గ్రామానికి చెందిన ఈదర మురళి ప్రశ్నించగా, మాటా మాటా పెరగడంతో విశ్వనాథం, అతని కుమారుడు రాజశేఖర్ మురళీని కొట్టి గాయపర్చారు. ప్రస్తుతం బాధితుడ్ని చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మురళీ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ ఎం. సత్యనారాయణ తెలిపారు.

కొవ్వూరులో అదృశ్యం... హైదరాబాద్‌లో ప్రత్యక్షం

కొవ్వూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్. సాంబమూర్తి తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం .. కాకినాడ జిల్లా పెద్దాపురం శంకరయ్యపేటకు చెందిన వీరవాసరపు యేసురత్నం వేసవి సెలవుల నిమిత్తం కొవ్వూరు అత్తగారింటికి వచ్చింది. ఈనెల 14వ తేదీ ఉదయం మూడు గంటల సమయంలో ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. దీంతో చుట్టుపక్కల ఉన్న బంధువుల ఇళ్లకు వెళ్లి వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అత్త వీరవాసరపు దుర్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మహిళ హైదరాబాద్‌లో ఉన్నట్టు గుర్తించినట్టు పట్టణ సీఐ విశ్వం తెలిపారు.

మహిళా పీఎస్ డీఎస్పీగా సత్యనారాయణ

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా కేవీ సత్యనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు జిల్లాలో పని చేసిన అనుభవం ఉంది. 1991 బ్యాచ్ ఎస్ఐగా విధుల్లో చేరిన ఆయన.. ఉమ్మడి తూర్పు గోదావరిలో సీఐ, ట్రాఫిక్‌గా పని చేశారు.